
శుక్రవారం 28, ఫిబ్రవరి 2025

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**నా గెలుపు ఖాయం**

- గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి ధీమా

7

**ముగిసిన పోసాని విచారణ**

- రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ ముందు హాజరు

5

# పట్టాలెక్కుతున్న పీ-4

## ఉగాది నుంచి శ్రీకారం చుడుతున్న ప్రభుత్వం

- పేదల సాధికారతే లక్ష్యంగా వినూత్న కార్యక్రమం
- బడుగులకు సంపన్న కుటుంబాల తోడ్పాటే పీ-4
- ప్రభుత్వ పథకాలకు అదనంగా పేదలకు సాధికారత
- ఆగస్టునాటికి 5 లక్షల కుటుంబాల ధృవీకరణ పూర్తి
- ముందుగా నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు అమలు
- అధికారులతో సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశం



2



## ప్రజాస్వామ్య దేశంలో ఓటే ఆయుధం

3లో..


పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన సీఎం, మంత్రి నారా లోకేష్

## పోటెత్తిన పట్టభద్రులు, టీచర్లు

- భారీగా పెరిగిన పోలింగ్
- ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- గెలుపుపై కూటమి అభ్యర్థుల ధీమా

5





## జాతీయ క్రీడలకు ఆతిథ్య అవకాశం అడిగా..

- భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో సీఎం భేటీ
- స్పోర్ట్స్ సిటీ అభివృద్ధిపై చర్చ
- వివరాలను ఎక్స్‌లో పోస్టు చేసిన చంద్రబాబు

2



2

## చంద్రన్న పెద్దమనసు!

వివాహానికి సాయం కోరిన అంధ యువతికి సీఎం చంద్రబాబు రూ.5 లక్షల ఆర్థికసాయం



## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తీరును పర్యవేక్షించిన మంత్రి లోకేష్

- వార్ రూమ్‌లో పార్టీ నేతలతో సమావేశం
- పోలింగ్ సరళిపై సమీక్ష
- ఎప్పటికప్పుడు నేతలకు దిశానిర్దేశం

4

## 49 కంపెనీలు.. 10 వేల ఉద్యోగాలు

- మార్చి 5,6 తేదీల్లో అతి పెద్ద కేరీర్ ఫెయిర్
- విశాఖ గీతం వర్సిటీలో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి లోకేష్

4





## నర్సింగ్ స్టూడెంట్స్‌కు.. జర్మన్ భాషలో శిక్షణ

- స్కిల్ బితో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం
- ఏటా వెయ్యిమంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో ఉద్యోగాలు
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఓయూ

4



'సూపర్ సిక్స్' ప్రాధాన్యతగా..

# నేడు రాష్ట్ర బడ్జెట్

- రూ.3.2 లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అనంతరం వ్యవసాయ బడ్జెట్ పెట్టనున్న మంత్రి అచ్చెన్న
- ముందుగా సీఎం అధ్యక్షతన అసెంబ్లీ ఛాంబర్‌లో కేబినెట్ భేటీ
- మండలిలో ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్లు పెట్టనున్న కొల్లు, నారాయణ
- బడ్జెట్‌లో మూలధన వ్యయం పెరిగే అవకాశం ఉందని అంచనా
- సంక్షేమం, అభివృద్ధి, ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు?
- గంపెడాశలతో ప్రభుత్వోద్యోగ వర్గాలు

5






# పట్టాలెక్కుతున్న పీ-4

- ఉగాదినుంచి శ్రీకారం చుడుతున్న ప్రభుత్వం
- పేదల సాధికారతే లక్ష్యంగా వినూత్న కార్యక్రమం
- బడుగులకు సంపన్న కుటుంబాల తోడ్పాటే పీ-4
- ప్రభుత్వ పథకాలకు అదనంగా పేదలకు సాధికారత
- ఆగస్టునాటికి 5 లక్షల కుటుంబాల ధృవీకరణ పూర్తి
- ముందుగా నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు అమలు
- అధికారులతో సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): అట్టడుగునున్న పేదల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పీ-4 కార్యక్రమానికి ఉగాదినుంచి శ్రీకారం చుడుతోంది. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ-4 విధానాన్ని ప్రవేశ పెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాలకు అందిస్తున్న పథకాలకు అదనంగా ఈ కార్యక్రమం ద్వారా అట్టడుగునున్న వారికి మరింత చేయూతనిచ్చే ప్రయత్నం చేస్తోంది. దీనికి సంబంధించి 'పీ-4, ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్ -బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'పైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉండవల్లి నివాసంలో శాఖపరమైన సమావేశాన్ని నిర్వహించారు.

### పేదరికంలేని రాష్ట్రమే లక్ష్యం

సంపదలో పైవరుసలోనున్న కుటుంబాలు సమాజంలో అట్టడుగునున్న కుటుంబాలకు మద్దతుగా నిలబడటమే పీ-4 విధానం ముఖ్యోద్దేశం కావాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇందుకు నిర్మాణాత్మక, స్థిరమైన విధానం ఉండాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

### ఉగాది నాటికి అమల్లోకి పీ4..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పీ-4 విధానం ఈ ఉగాది నాటికి కార్యరూపం దాల్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొదటగా రాష్ట్రంలోని 4 గ్రామాల్లో పీ-4 విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు రూపొందించారు. ఈ పైలెట్ ప్రాజెక్టుతో 5,869 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది.

### కుటుంబాల ధృవీకరణ

ఈ విధానం ద్వారా లబ్ది పొందేందుకు అర్హతవున్న కుటుంబాలను జీఎస్‌డబ్ల్యుఎస్ డేటాబేస్, హౌస్‌హోల్డ్ సర్వే, గ్రామసభ ధృవీకరణ ద్వారా గుర్తించడం జరుగుతోంది. 2 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాలు మెట్ట భూమివున్న భూయజమానులను, ప్రభుత్వోద్యోగులను, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారిని, ఫోర్ వీలర్ వెహికల్ ఉన్నవారిని, 200 యూనిట్లుకన్నా ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నవారిని, మున్సిపల్ ఏరియాలో సొంత ఆస్తి ఉన్నవారిని, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న కుటుంబాలవారిని ఈ కార్యక్రమంనుంచి మినహాయించారు. తద్వారా నిజంగా పేదరికంలో ఉన్నవారికి సాయం అందచేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో రాష్ట్రంలోని 40 లక్షల కుటుంబాలు పీ-4కు అర్హులుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

### కొనసాగుతున్న హౌస్ హోల్డ్ సర్వే

హౌస్ హోల్డ్ సర్వే మొదటి దశ కింద రాష్ట్రంలో 10 జిల్లాల్లో ఫిబ్రవరి 20నుంచి సర్వే జరుగుతోంది. ఇది మార్చి 2కి పూర్తవుతుంది. ఈ పది జిల్లాల్లో 52 లక్షల కుటుంబాలుంటే 27 లక్షల కుటుంబాల సర్వే పూర్తయ్యింది. రెండో దశ కింద రాష్ట్రంలో మిగిలిన 16 జిల్లాల్లో హౌస్ హోల్డ్ సర్వే మార్చి 8నుంచి మొదలుపెట్టి మార్చి 18నాటికి పూర్తి చేస్తారు. ఈ 16 జిల్లాల్లో 76 లక్షల కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. పేద కుటుంబాలకు ఇప్పటికే అందుతున్న వివిధ ప్రభుత్వ పథకాలకు అదనంగా వారి సాధికారత కోసం పీ-4 విధానం ద్వారా సాయం చేయనున్నారు. ఈ సర్వేలు అట్టడుగునున్న వారిని గుర్తించడానికే తప్ప... వీటి ఆధారంగా ఇప్పటికే ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్దిదారుల్లో ఎటువంటి మార్పులు చేయరు.

### అనుసంధానమే 'సమృద్ధి బంధనమ్'

లబ్దిదారుల ధృవీకరణ పూర్తైన తర్వాత 'సమృద్ధి బంధనమ్' ప్లాట్‌ఫామ్‌లో ఆయా కుటుంబాల వివరాలు పొందుపరుస్తారు. లబ్ది పొందాల్సిన కుటుంబాలతో సాయం చేసే కుటుంబాలను అనుసంధానించడమే ప్రభుత్వ పాత్రగా ఉంటుంది. ఎక్కడా ప్రభుత్వం నేరుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదు. మ్యాచింగ్, ఎనర్జింగ్, ట్రాకింగ్... వరకే ప్రభుత్వ పాత్ర ఉంటుంది. ఇందులో ఎటువంటి ఒత్తిడి ఉండదు. స్వచ్ఛంధంగా ఆయా కుటుంబాలు, వ్యక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చు.

### 'పీ-4'లోకి ఆగస్టుకల్లా 5 లక్షల కుటుంబాలు

ఈ ఉగాదికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అమల్లోకి రానున్న కార్యక్రమంలో ఈ ఏడాది ఆగస్టునాటికి 5 లక్షల అభిలాషి కుటుంబాలను 'సమృద్ధి బంధనమ్' కింద తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, సీనియర్ అధికారులు పీయూష్‌కుమార్, కాటంనేని భాస్కర్, ప్లానింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడలకు ఆతిథ్య అవకాశమివ్వమని అడిగా..



- భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో సీఎం భేటీ
- స్పోర్ట్స్ సిటీ అభివృద్ధిపై చర్చ
- వివరాలను ఎక్స్‌లో పోస్టు చేసిన చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): 2029లో జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యమిచ్చేందుకు అవలాశం కల్పించాలని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉషను కోరినట్టు సీఎం చంద్రబాబు వెల్లడించారు. గురువారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబును భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష గౌరవసూచకంగా కలిశారు. ఉషతో క్రీడాంశాలపై చర్చించిన సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా వివరాలను పోస్టు చేస్తూ.. నూతన క్రీడా విధానం, అథ్లెట్లకు శిక్షణపై చర్చించినట్టు ట్వీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రానికి స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని తీసుకొచ్చే విషయంలో ఆమె మద్దతు కోరినట్లు వెల్లడించారు. అమరావతిలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, స్పోర్ట్స్ సిటీని అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా చర్చించామన్నారు. ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు అత్యుత్తమ అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు ట్వీట్‌లో స్పష్టం చేశారు.



## చంద్రన్న పెద్దమనసు!

- వివాహానికి సాయం కోరిన అంధ యువతికి
- సీఎం చంద్రబాబు రూ.5 లక్షల ఆర్థికసాయం



అమరావతి (చైతన్య రథం) తన వివాహానికి సాయం కోరిన ఓ అంధ యువతికి సీఎం చంద్రబాబు రూ.5 లక్షల సాయం అందించారు. కుప్పం మండలం రాళ్లబుదుగూరుకు చెందిన ఆర్ నాగమణి దేవుడి చిన్నచూపుతో అంధురాలిగా జన్మించింది. అయినప్పటికీ ఆత్మస్థైర్యం, పట్టుదల, తల్లి దండ్రుల ప్రోత్సాహంతో ఎంఏ వరకూ చదువుకుంది. ఆమె అంధురాలు కావడం, కుటుంబం ఆర్థికంగా బాగా ఇబ్బందుల్లో ఉండటంతో వివాహమవ్వడం భారంగామారింది. ఆ కుటుంబ ధీన పరిస్థితిని అర్థం చేసుకుని శాంతిపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన భూపతి అనే యువకుడు నాగమణిని మనువాడేందుకు ముందు కొచ్చాడు. ఇటీవల నాగమణి ముఖ్యమంత్రిని భూపతితో కలిసి వచ్చి తన వివాహానికి ఆర్థికసాయం చేయాలని కోరింది. స్పందించిన సీఎం చంద్ర బాబు వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు ప్రకటించారు. బుధవారం సీఎం చంద్ర బాబును కలిసి చెక్కు అందుకున్నారు. నాగమణిని వివాహం చేసుకుని తోడ్పా టుగా ఉండేందుకు ముందుకువచ్చిన భూపతిని సీఎం చంద్రబాబు అభినందించారు. కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

చైతన్యరథం



## ప్రజాస్వామ్య దేశంలో

# ఓటే ఆయుధం

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన సీఎం, మంత్రి నారా లోకేష్

ఉండవల్లి (చైతన్య రథం): ప్రజాస్వామ్య దేశంలో ఓటే అతిపెద్ద ఆయుధమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అభిప్రాయాన్ని తెలపడానికి, ప్రజాస్వామ్యాన్ని చైతన్య పరచడానికి ఓటు ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. కృష్ణా- గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉండవల్లిలోని గాదె రామయ్య -సీతారావమ్మ ఎంపీయూపీ స్కూల్ బూత్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... ఓటు వేయడం అందరి బాధ్యతని, దాన్ని హక్కుగా వినియోగించుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం, దేశ ప్రతిష్టకు ఓటు బలంగా పనిచేస్తుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.



















చైతన్యరథం

## నర్సింగ్ స్టూడెంట్స్‌కు

# జర్మన్ భాషలో శిక్షణ



- స్కిల్ బితో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం
- ఏటా వెయ్యిమంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో ఉద్యోగాలు
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో స్కిల్ బి అవగాహన ఒప్పందం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు జర్మనీ, ఐరోపాదేశాల్లో ఉద్యోగావకాశాలు లభించేలా శిక్షణ ఇప్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) స్కిల్ బి నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇరుపక్షాలు గురువారం ఎంఓయుపై సంతకాలు చేశాయి.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... జర్మనీలో వృద్ధుల సంరక్షణ, హాస్పటల్స్‌లో 3 లక్షల మంది నర్సింగ్ అభ్యర్థుల కొరత ఉందని తెలిపారు. యూరప్‌లో ముఖ్యంగా జర్మనీలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు గాను రాష్ట్రంలో నర్సింగ్ విద్యనభ్యసించిన విద్యార్థినులకు స్కిల్ బి ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. ఈ శిక్షణ వల్ల ప్రతిఏటా వెయ్యిమంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో అత్యుత్తమ ప్యాకేజితో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.

స్కిల్ బి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ వింజమూరి రవిచంద్ర గౌతమ్, సీఈఓ ఉజ్వల్ చౌహన్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యాన ఇప్పటివరకు 10వేల మందికి పైగా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. స్కిల్ బి అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ స్టార్టప్‌లలో ఒకటిగా ఉందని తెలిపారు. జర్మనీ, పోలాండ్, హంగేరీ, లిథువేనియా, లాట్వియా, ఇతర తూర్పు ఐరోపా దేశాలకు తమ సంస్థ ద్వారా అభ్యర్థులను రిక్రూట్ చేస్తున్నామని అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ భాగస్వామ్యంతో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం స్పెషలైజేషన్‌తో గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన నర్సులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి, ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. స్కిల్ బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఏపీఎస్ఎస్‌డీసీలు భాషా నైపుణ్య కొరతను పరిష్కరించి, ఏపీని నైపుణ్య రాజధానిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, విశాఖపట్నంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు, ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని 4వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థినుతకు స్కిల్ బి ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, ఏపీఎస్ఎస్‌డీసీ సీఈఓ గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్, మెడిక్రూటర్ ఎండి రోనాల్డ్ రెస్కే పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తీరును

# పర్యవేక్షించిన మంత్రి లోకేష్



- వార్ రూమ్‌లో పార్టీ నేతలతో సమావేశం
- పోలింగ్ సరళిపై సమీక్ష
- ఎప్పటికప్పుడు నేతలకు దిశానిర్దేశం

అమరావతి (చైతన్యరథం): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తీరును రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ స్వయంగా పర్యవేక్షించారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి, ఉమ్మడి గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా ఉన్న మంత్రి లోకేష్ ఉండవల్లిలో ఓటు వేసిన అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని పోలింగ్ సరళిపై అందుబాటులోని పార్టీ నేతలతో వార్ రూమ్‌లో సమావేశమ య్యారు. పోలింగ్ తీరుతెన్నులను పరిశీలిస్తూ, తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ నేతలకు మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు. పోలింగ్ శాతం తక్కువగా నమోదైన నియోజకవర్గాలపై దృష్టి పెట్టి స్వయంగా ఎమ్మెల్యేలతో ఫోన్లో మాట్లా డారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులను ఆదేశించారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకు నేలా చూడాలని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులకు మార్గ నిర్దేశం చేశారు. పోలింగ్ తీరును ఎప్పటికప్పుడు పర్య వేక్షిస్తూ నేతలకు తగిన సూచనలు చేశారు.



# 49 కంపెనీలు..

# 10 వేల ఉద్యోగాలు

- మార్చి 5,6 తేదీల్లో అతి పెద్ద కేరీర్ ఫెయిర్
- విశాఖ గీతం వర్శిటీలో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి లోకేష్



అమరావతి (చైతన్యరథం): విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో మార్చి 5,6 తేదీల్లో నాస్కామ్, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా కెరీర్ ఫెయిర్ నిర్వహించనున్నాయి. ఈ కెరీర్ ఫెయిర్‌లో 49 ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల్లో యువతీ, యువకులకు సుమారు 10వేల ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ఆవిష్కరించారు.

2024, 2025 ఏడాదుల్లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువత రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నాస్కామ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్మిత్ సింగ్, నేషనల్ లీడ్ ఉదయ్ శంకర్, ఏపీ లీడ్ ప్రవీణ్ కుమార్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

## 'సూపర్ సిక్స్' ప్రాధాన్యతగా..

# నేడు రాష్ట్ర బడ్జెట్

- రూ.3.2 లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టనున్న మంత్రి పయ్యావుల
- అనంతరం వ్యవసాయ బడ్జెట్ పెట్టనున్న మంత్రి అచ్చెన్న
- ముందుగా సీఎం అధ్యక్షతన అసెంబ్లీ ఛాంబర్‌లో కేబినెట్ భేటీ
- మండలిలో ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్లు పెట్టనున్న కొల్లు, నారాయణ
- బడ్జెట్‌లో మూలధన వ్యయం పెరిగే అవకాశం ఉందని అంచనా
- సంక్షేమం, అభివృద్ధి, ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు?
- గంపెడాశలతోవున్న ప్రభుత్వోద్యోగ వర్గాలు

అమరావతి (చైతన్య రథం): 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3.25 లక్షల కోట్ల అంచనాలతో ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 11గంటలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో 'సూపర్ సిక్స్' సంక్షేమ పథకాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు ప్రజలకు మరికొన్ని కానుకలు ఉండొచ్చన్న మాటా వినిపిస్తోంది. అలాగే, కేంద్ర ప్రభుత్వ సహకారంతో బడ్జెట్‌లో భారీగా పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపులు చేసే అవకాశం లేకపోలేదని అంటున్నారు. ప్రధానంగా.. వైకాపా హయాంలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించే మార్గాలతో పాటు మూలధన వ్యయం పెంచే విధంగా బడ్జెట్‌ను రూపొందించినట్టు సమాచారం.

2025-26వ ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం నేడు శాసన సభలో బడ్జెట్ పెట్టనుంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 2025-26 వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. అనంతరం శాసన సభలో మంత్రి పయ్యావుల బడ్జెట్ ప్రేవేశపెడతారు. అదేవిధంగా.. శాసన మండలిలో రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ప్రవేశపెడతారు. ఆర్థిక బడ్జెట్ అనంతరం ప్రత్యేకంగా సేద్యం బడ్జెట్‌ను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెడతారు. శాసన మండలి ముందు మంత్రి నారాయణ వ్యవసాయ బడ్జెట్ ఉంచుతారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఈ బడ్జెట్ ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలోనే తొలిసారిగా రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలిచింది. గతేడాది ఫిబ్రవరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టగా... అదే ఏడాది జూలైలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్థిక గందరగోళం నేపథ్యంలో మరోసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది.

2025 ఏప్రిల్ 1నుంచి మొదలయ్యే ఆర్థిక సంవత్సరానికిగాను 3.25 లక్షల కోట్లమేర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని అంటున్నారు. 'సూపర్ సిక్స్' పథకాల అమలులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 'తల్లికి వందనం' పథకంతోపాటు రైతులకు ఆర్థిక సాయంగా 'అన్నదాత సుఖీభవ', 'ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం' పథకాలను అమలు చేయాల్సి ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ప్రతీ తల్లికి ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాల్సి ఉంది. ఈ పథకం అమలుకు ఇప్పటికే అర్హులను గుర్తించారు. ఒక్కో బిడ్డ కోసం తల్లుల ఖాతాల్లో ఏడాదికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయం ఇవ్వడానికి సుమారు రూ.10,300 కోట్లు ఖర్చవుతుందని అంచనా. మేలో పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా వెల్లడించారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఇందుకోసం రూ.10,717 కోట్లు అవసరమని లెక్క వేసారు. పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే ఆరు వేలు మినహాయించటం ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి రూ.14 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. ఇందుకు రూ.7,502 కోట్లు అవసరమని తేల్చారు. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో చెల్లించేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం బడ్జెట్ శాఖల వారీగా కేటాయింపులు చేయనుంది. అలాగే రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం కూడా భారీగా నిధులు చెల్లించడంతో దానికి ప్రాధాన్యతనిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటితోపాటు ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల కోసం పెద్దమొత్తంలో మూలధనం వ్యయాన్ని పెంచే ఛాన్స్ ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పేదలతోపాటు మధ్యతరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో కేటాయింపులుండే అవకాశం ఉంది. మధ్యతరగతిపై పన్నులు, విద్యుత్ ఛార్జీల భారం లేకుండా చూసేలా ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేసింది. ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ ఇచ్చే అంశంపైనా బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే ఉపాధి అవకాశాలు పెంచేలా వివిధ పీపీపీ ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా నిధులను సైతం ప్రకటించే అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. డ్వాక్రా మహిళలు, రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేలా వడ్డీలేని రుణాల అంశాన్ని బడ్జెట్‌లో వెల్లడించే అవకాశం లేకపోలేదు. అలాగే, బడ్జెట్‌లో తమకు భారీ ప్రయోజనాలు దక్కే అవకాశాలు లేకపోలేదని ప్రభుత్వోద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది.

మరోపక్క -వ్యవసాయ బడ్జెట్ రూ.50 వేల కోట్లు దాటే అవకాశం ఉందనీ అంటున్నారు. సంపద సృష్టిలో భాగంగా ప్రకృతి సేద్యాన్ని పెద్దఎత్తున ప్రమోట్ చేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగినట్టుగా కేటాయింపులు చేసే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అలాగే, బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఉప ప్రణాళిక ప్రకటించే ఆస్కారం లేకపోలేదు.

# పోటెత్తిన పట్టభద్రులు, టీచర్లు

- భారీగా పెరిగిన పోలింగ్
- ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- గెలుపుపై కూటమి అభ్యర్థుల ధీమా

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి, ఉమ్మడి గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో గతంలో కంటే ఈ సారి పోలింగ్ శాతం భారీగా పెరిగింది. అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలింగ్ సాఫీగా జరిగింది. కృష్ణ, గుంటూరు జిల్లాల పరిధిలోని 33 నియోజకవర్గాలు, గోదావరి జిల్లాల్లోని 34 నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘాతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో 6 లక్షల 62 వేల మంది పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. రెండు చోట్ల దాదాపు 60 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అధికారులు 939 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానానికి 69.57 శాతం పోలింగ్ నమోదయింది. పట్టభద్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్లు వేసేందుకు తరలిరావడంతో భారీ పోలింగ్ నమోదైంది. ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని.. తప్పకుండా విజయం సాధిస్తానని కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. గతంలో నమోదైన 59.95 శాతంతో పోలిస్తే ఈసారి 10 శాతం ఎక్కువగా పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 3,47,116 మంది ఓటర్లకు గాను.. 2,41,502 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాల వారీగా చూస్తే.. ఏలూరు జిల్లాలో 73.30శాతం, కృష్ణా జిల్లాలో 69.91శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 65.69 శాతం, గుంటూరు 66.45 శాతం, బాపట్ల 74.30 శాతం, పల్నాడు 77.33 శాతం పోలింగ్ నమోదైంది.

గోదావరి జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానానికి 63.28 శాతం పోలింగ్ నమోదయింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో 10 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ స్థానంలో 22,493 ఉపాధ్యాయ ఓటర్లుండగా 91.82 శాతం పోలింగ్ నమోదయింది. బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

## చంద్రబాబు పాలన పట్ల పట్టభద్రుల సంతృప్తి

- మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎంఎంకెఎం మున్సిపల్ ఉన్నతపాఠశాల పోలింగ్ కేంద్రంలో 429 బూత్‌లో గురువారం మంత్రి రామానాయుడు ఓటు వేశారు. అనంతరం ఆయన నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ప్రథమ ప్రాధాన్యత ఓటుతోనే మంచి మెజార్టీతో విజయం సాధిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్,మోదీల మేలుకలయికను, కూటమి ప్రభుత్వాన్ని పట్టభద్రులు ఏకపక్షంగా సమర్థిస్తున్నట్లుగా ఓటింగ్ సరళిని బట్టి వెల్లడవుతోందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసినా.. సీఎం చంద్రబాబు ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారని తెలిపారు. గతంలో రాష్ట్రం విడిచి వెళ్లిన పరిశ్రమలతో పాటు కొత్త పరిశ్రమలు కూడా చంద్రబాబు పాలనపై నమ్మకంతో రాష్ట్రానికి రాబోతున్నాయన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీతో పాటు నిరుద్యోగ యువతీ యువకులకు వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి రామానాయుడు తెలిపారు.

# ముగిసిన పోసాని విచారణ

- తొమ్మిది గంటలు విచారణ
- పోలీసు అధికారులకు సహకరించని పోసాని
- రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ ముందు హాజరు

ఓబులవారిపల్లె (చైతన్యరథం): వైసీపీ నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళిని అన్నమయ్య జిల్లా పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో తొమ్మిది గంటలకు పైగా పోసానిని అధికారులు విచారించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి రైల్వేకోడూరు కోర్టుకు తరలించి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. విచారణకు పోసాని సహకరించలేదని అధికారులు తెలిపారు. ఏ ప్రశ్న అడిగినా.. తెలియదు, గుర్తు లేదు, మర్చిపోయా అంటూ సమాధానాలు దాటవేశారు. మీడియా సమావేశంలో మాట్లాడిన వీడియోలను ముందు పెట్టి ప్రశ్నించినా.. పోసాని సమాధానం ఇవ్వకుండా తన శైలిలోనే ప్రవర్తించినట్లు అధికారులు తెలిపారు.

### ఆరోగ్య సమస్యలు లేవు

హైదరాబాద్‌లోని రాయదుర్గంలో మై హోమ్ భూజా అపార్ట్‌మెంట్‌లో బుధవారం రాత్రి పోసానిని అదుపులోకి తీసుకున్న పోలీసులు నేరుగా అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్ స్టేషనకు తీసుకొచ్చారు. పోలీస్ స్టేషన్లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేష్ ఆధ్వర్యంలో పోసానికి వైద్యపరీక్షలు నిర్వహించారు. పోసానికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని డాక్టర్ గురుమహేష్ తెలిపారు. పోలీసు విచారణకు ఆరోగ్య సమస్యలు ఎదురుకావని పేర్కొన్నారు. ఆయన స్టేట్మెంట్‌ను రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు నమోదు చేశారు. మరో వైపు పోసాని కృష్ణమురళిని కలిసేందుకు ఆయన తరపు న్యాయవాది నాగిరెడ్డి.. ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌కు రాగా..పోలీసులు అనుమతించలేదు. ఉన్నతాధికారుల అనుమతిలేకుండా లోపలికి పంపలేమని సీఐ చెప్పడంతో ఆయన వెనుదిరిగారు. వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పెద్ద ఎత్తున అనుచరులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోసానిని చూడాలని పట్టుబట్టారు. తమ విధులకు ఆటంకం కలిగించవద్దని పోలీసులు హెచ్చరించడంతో వెనుదిరిగారు.

సినీ పరిశ్రమలో వర్గవిభేదాలు తలెత్తేలా, ఉపముఖ్యమంత్రి,జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండురోజుల క్రితం ఇచ్చినఫిర్యాదుపై ఓబుల వారిపల్లె పోలీసుస్టేషన్లో కేసునమోదైంది. వర్గాలమధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభి యోగాలపై బీఎన్ఎస్‌లోని 196,353(2),111 రెడ్విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది. దీనిలోనే పోలీసులు పోసానిని అరెస్టు చేశారు.వైసీపీ హయాంలో నాటి ప్రభుత్వ పెద్దల అండదండలు,ఆదేశాలతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ సహా నాటి ప్రతిపక్షంలోని ముఖ్యులు, వారి కుటుంబాల్లోని మహిళలపై అసభ్య పదజాలం, బూతులతో పోసాని కృష్ణమురళి పేట్రేగిపోయారు.

చైతన్యరథం



# మంగళగిరిలో మల్లేశ్వరస్వామివారి రథోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

**- ఘనస్వాగతం పలికిన ఆలయ నిర్వాహకులు**



మంగళగిరి (చైతన్యరథం): శివరాత్రి వేడుకల్లో భాగంగా మంగళగిరిలోని బ్రహ్మసూత్రం గల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రథోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో మంత్రి ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల శివనామ స్మరణ, అశేష జనసందోహం మధ్య రథాన్ని లాగారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విశ్వేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవంలో పాల్గొన్న మంత్రి

మంగళగిరిలో వేడుక అనంతరం కృష్ణాయపాలెంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ సమేత శ్రీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం విశ్వేశ్వర స్వామి వారిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం విశ్వేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. తరువాత స్థానిక ప్రజలతో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.















# తప్పు చేసిన వారు తప్పించుకోలేరు

- గత ఐదేళ్లు అధికారం అండతో పేట్రేగిపోయారు
- పోసాని నోటి దురుసు వ్యాఖ్యలు గుర్తున్నాయి
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- వైసీపీ నేతలు నీతులు మాట్లాడటం సిగ్గుచేటు
- గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర



మంగళగిరి(చైతన్యరథం): అధికారం అండగా అడ్డగోలుగా వ్యవహరిస్తే చట్టం చూస్తూ ఊరుకోదని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. పోసాని కృష్ణమురళి అరెస్టుపై స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర అరెస్టును సమర్థించారు. అధికారం అండతో గత ఐదేళ్లు వైసీపీ నేతలు ఎంతటి దుర్మార్గంగా వ్యవ హరించారో రాష్ట్ర ప్రజలంతా చూశారు. నంది అవార్డులపై కూడా ఇష్టారీతిగా ప్రవర్తించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్, పవన్‌కల్యాణ్ విషయంలో నాడు ఎంతటి పరుష పదజాలంతో దూషించారో ప్రజలందరికీ గుర్తుంది. అలాంటి వారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే వైసీపీ నేతలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారో వారికే తెలియాలి. ఐదేళ్ల పాటు దాడులు, దుర్మార్గాలు, తప్పుడు కేసులు, తప్పుడు పోస్టింగులతో పేట్రేగిపోయిన వైసీపీ నాయకులు ఇప్పుడు నీతులు మాట్లాడడం హాస్యాస్పదం. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడాలంటేనే భయపడే పరిస్థితులు కల్పించిన ఘనత జగన్‌రెడ్డిది. నేడు న్యాయబద్ధమైన పాలన అందిస్తుంటే చూసి ఓర్వలేక తప్పుడు ప్రచా రాలకు పాల్పడుతున్నారు. పోసాని కృష్ణమురళి సహా..తప్పు చేసిన ఏ ఒక్కరు కూడా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

# గ్రాడ్యుయేల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నా గెలుపు ఖాయం

**- కూటమి అభ్యర్థి ఆలపాటి ధీమా**



అమరావతి (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన విజయం ఖాయమని కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ 69 శాతానికి పైగా ఓటింగ్ జరగడంపై హర్షం బులిబుచ్చారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోంది కాబట్టే పట్టభద్రులు తనకు ఘన విజయాన్ని అందించబోతున్నారని ఆలపాటి రాజా అన్నారు. ప్రత్యర్థులెవరనేది కాదు ప్రగతికి ఓటేయాలని తాము నినదించామని చెప్పారు. ఎన్నికల్లో తనకు సహకరించిన కూటమి నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్ బాబు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

## గృహ రుణాలకు సకాలంలో పత్రాలు అందించాలి

- ఇళ్లస్థలాలకు అనువైన భూములను గుర్తించాలి
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



ఒంగోలు(చైతన్యరథం): గృహ రుణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు ఇబ్బందులు లేకుండా ప్రజలకు సకాలంలో అందించాలని సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సూచించారు. గురువారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం లోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు, హౌసింగ్ పీడీతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్లస్థలాల కోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. భూ రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆదే శించారు. పరిశ్రమలకు భూములుకేటాయించే అంశంలో రైతులు, కలెక్టర్‌తో సంప్రదించి ఎలాంటిసమస్యలు తలెత్తకుండా చూడాల ని సూచించారు. గృహ రుణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫి కెట్, కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని తెలి పారు. అనంతరం గ్రామసచివాలయ యానిమల్ హస్బెండ్రీ అసో సియేషన్ రాష్ట్ర ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అంద జేశారు. తమకు అటెండెన్స్ ఆప్షన్‌లో అదర్ ఆప్షన్‌ను పునరుద్ధ రించరాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

## బ్యాడ్మింటన్ జాతీయ క్రీడల్లో పతకం

- అభినందించిన మంత్రి కందుల దుర్గేష్
- క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్ష

రాజమండ్రి(చైతన్యరథం): ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లోని అంతర్జాతీయ క్రీడా సముదాయం హల్ద్వానీలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరిగిన ప్రతిష్టాత్మక 38వ జాతీయ క్రీడల్లో బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో ఏపీ నుంచి ప్రాతి నిధ్యం వహించి రాజమండ్రి కుర్రోడు, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కర్రి సాయిపవన్ కాంస్య పతకం సాధించాడు. గురువారం రాజమండ్రిలోని మంత్రి కార్యాల యంలో ఈ మేరకు కర్రి సాయిపవన్ తన తండ్రి కర్రి నాగేశ్వరరావుతో కలిసి మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కాంస్య పతకాన్ని చూపించారు. అనంత రం తన మెడలో పతకాన్ని మంత్రి చేతులమీదుగా మెడలో వేయించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ తన క్రీడా ప్రతిభతో రాష్ట్రంతో పాటు తూర్పుగోదావరి జిల్లాకు మంచి పేరు తీసుకురావడం గర్వంగా ఉందని పవన్‌తో పాటు తల్లిదండ్రులను అభినందించారు. క్రీడా రంగంలో పవన్ మరింత ఉన్నతస్థాయికి చేరాలని ఆశీస్సులు అందించారు. పవన్ ప్రతిఒక్క క్రీడాకారుడికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.






*పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుంటూరు గుజ్జనగుండ్ల ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజీలో తమ ఓటు హక్కుని వినియోగించుకున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్.*



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోకృష్ణా జిల్లా పామర్రు హైస్కూల్‌లో ఓటు వేసిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

## నీచంగా వాగితే ఇంతే..

**- పోసాని అరెస్ట్‌పై సోమిరెడ్డి స్పందన**



అమరావతి (చైతన్యరథం): నోరుంది కదా అని నీచంగా వాగేవాళ్లకు ఏ గతి పడుతుందనేందుకు పోసాని కృష్ణమురళి ఉదంతమే నిదర్శనమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. పోసాని అరెస్టును తెలుగు ప్రజలందరూ స్వాగతిస్తున్నారన్నారు. సినీ రంగంలో ఉంటూ పవన్ కళ్యాణ్ పై, రాజకీయాల్లోకి వచ్చి చంద్రబాబునాయుడుపై, లోకేష్‌పైనా పోసాని వాడిన క్రూరమైన భాషకు 111 సెక్షన్ చాలదేమో...పోసాని కృష్ణమురళి లాంటి వారిని శిక్షించేందుకు కొత్తగా 555, 999 సెక్షన్లు రూపొందించాలేమోనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇదంతా సరే కానీ...ఒక డైరెక్టర్ ను మాత్రం ఇంకా బొక్కలో వేయకుండా వదిలిపెట్టడంపై ప్రజలందరూ అసంతృప్తితో ఉన్నారనేది వాస్తవమని ఎక్స్‌లో సోమిరెడ్డి పోస్ట్ చేశారు.

# రైతు, మహిళా సంఘాల ఉత్పత్తులకు ఆదాయం



- తగిన కార్యాచరణతో ముందుకురావాలి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచన
- సెర్ప్ అధికారులు, కంపెనీలతో సమీక్ష

అమరావతి(చైతన్యరథం): స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాదులు, రైతు ఉత్పత్తి సంస్థల (ఎఫ్‌పీఓల) సభ్యుల ఉత్పత్తులకు విలువ జోడించి అధిక ఆదాయం పొందేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సచివాలయం ఐదో బ్లాక్‌లోని తన కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు, ఫాంవేద, మిల్లెట్ బ్యాంక్, క్యాపిటల్ మేనేజ్‌మెంట్ సర్వీస్, ఫ్లిప్ కార్ట్ కంపెనీలతో మంత్రి సమీక్ష నిర్వ హించారు. స్వయం సహాయ సంఘాల మహిళలు వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారని, వాటికి విలువ జోడించి అత్యధిక ఆదాయం పొందేందుకు తీసు కోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. ఇందుకు అవసరమైన తగిన కార్యాచ రణతో ముందుకు రావాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంస్థలు తయారుచేసిన ఉత్పత్తులకు అత్యధిక ధర పొందేందుకు తగిన కార్యాచరణతో ముందుకుసాగాలని సూచించారు. ఈ సందర్భంగా ఫామ్ వేద, మిల్లెట్ బ్యాంక్, క్యాపిట ల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు రైతు ఉత్పత్తులకు విలువ జోడించి అత్యధిక ఆదాయం పొందే మార్గాలపై వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యు లు, రైతు ఉత్పత్తి సంస్థల సభ్యుల ఆలోచనలకు అనుగుణంగా వారి ఉత్పత్తులకు అధిక విలువ జోడించి అధిక ఆదాయం పొందేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సంస్థల ప్రతిపాదనలపైనా చర్చించారు. త్వరలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)తో ఆయా కంపెనీలు ఎంవోయూలు చేసేందుకు నిర్ణ యించారు. మహిళలు ఉత్పత్తి చేసే ఉత్పత్తులకు అధిక ఆదాయం పొందేందుకు అవసర మైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ సమావేశంలో సెర్ఫ్ సీఈ వో కరుణ, డైరెక్టర్ పద్మావతి, ఐఐఎం బెంగళూరు ప్రొఫెసర్ త్రిలోచనాశాస్త్రి, మిల్లెట్ బ్యాంక్ సీఈవో విశాల, క్యాపిటల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సీఈవో రజిని, డైరెక్టర్ హెచ్ ఎస్ విశ్వనాథ్, ఫ్లిప్‌కార్ట్ ప్రాజెక్ట్ హెడ్ దీపూజ్యోషి తదితరులు పాల్గొన్నారు.

# ఆలపాటికి భారీ మెజార్టీ ఖాయం

**- ఏపీటీడీసీ ఛైర్మన్ డా.నూకసాని**



గుంటూరు (చైతన్యరథం): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారీ మెజారిటీతో గెలుపొందుతారని గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిశీలకులు, ఏపీటీడీసీ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం తూర్పు నియోజకవర్గంలోని అన్ని బూత్‌లను నూకసాని సందర్శించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరుగుతున్నట్లు నిర్ధారించుకున్నారు. కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు, యూనిట్ నాయకులతో మాట్లాడి పోలింగ్ శాతం పెంచే విధంగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఓటర్లందరూ ప్రజాస్వామ్యంలో అతి విలువైన ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ఈ ఎన్నికలలో మన అభ్యర్థికి ఓటు వేయడం అంటే, మన ప్రాంత అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే అన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఉన్న కార్యకర్తలు ఓటర్లకు అవసరమైన సహాయం అందించి, వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి సహకరించారని. గత ఎన్నికల కంటే ఈసారి భారీగా ఓటింగ్ నమోదు అయిందని, దానివల్ల ఆలపాటికి అధిక మెజారిటీ లభిస్తుందని ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ , గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దాసరి రాజా మాస్టర్, యువ నాయకులు బట్టు ప్రవీణ్ కుమార్, డిప్యూటీ మేయర్ సాజీల, కార్పొరేటర్లు ఎలావుల అశోక్, పోతురాజు సమత, తెలుగు మహిళా నాయకురాలు గుడివల్లు వాణి, మాజీ కార్పొరేటర్ గోళ్ళ ప్రభాకర్, పురుషోత్తమరావు, బీజేపీ నాయకుడు కిషోర్ కుమార్, జనసేన నాయకుడు దయా రత్నం, ఎస్సీ సెల్ నాయకుడు బాంక చిరంజీవి. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్చి 5న విచారణకు రావాలి

***- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసుల నోటీసులు***



అనంతపురం (చైతన్యరథం): సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారని.. విచారణకు రావాలంటూ అనంతపురం మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్‌కు విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. 3 నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలతో పాటు మీడియా సమావేశంలో అత్యాచార బాధితురాలి పేరు వెల్లడించారని గతేడాది నవంబర్ 2న వాసిరెడ్డి పద్మ విజయవాడలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మాధవ్‌పై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం అనంతపురంలోని గోరంట్ల మాధవ్ నివాసానికి వెళ్లిన విజయవాడ పోలీసులు మార్చి 5న విచారణకు రావాలని సెక్షన్ 35(3) కింద నోటీసులు అందజేశారు. విజయవాడలోని సైబర్ క్రైమ్ పోలీసుల ఎదుట హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు.



# శివదీక్ష విరమించిన మంత్రి వాసంశెట్టి

శ్రీశైలం (చైతన్యరథం): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శివ దీక్షను విరమించినారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 11 రోజులపాటు శివదిక్షను చేపట్టిన అయన ఈనెల 26తో దీక్ష ముగిసిన నేపథ్యంలో గురువారం శ్రీశైలం వెళ్ళి మల్లన్న సన్నిధిలో దీక్ష విరమించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ దీక్ష ద్వారా భక్తితో పాటు మనిషికి మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సమకూరుతాయని, కార్యదక్షతకు ఆటంకాలు తొలగిపోతాయని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. మంత్రికి ఆలయ కమిటీ ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వాదం అందించారు.

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

**- ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ (చైతన్యరథం): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సీవీఆర్ హై స్కూల్, చిట్టూరి హై స్కూల్, ఏకేటీపీ స్కూల్, ఎంకే బేగ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను, ఓటింగ్ సరళిని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మీడియాతో మాట్లాడుతూ ఓటు వేయడం మనందరి బాధ్యత అన్నారు. పట్టభద్రులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలు.. ఓటర్లకు అందిస్తున్న సేవలను బొండా ఉమా స్వయంగా పరిశీలించారు. ఓటర్లకు సీరియల్ నెంబరు, జాబితాలో క్రమసంఖ్య తదితర వివరాలను ఓపిగ్గా వెతికి వివరాలు అందించారంటూ అభినందించారు. సెంట్రల్ నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్టీసీ రీజనల్ ఛైర్మెన్, నియోజజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ పూల నాగరాజు, సెంట్రల్ నియోజకవర్గ అబ్జర్వర్ దేవ తోటి నాగరాజు, క్లస్టర్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీత సాంబశివరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్, దాసరి కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు



విజయవాడ (చైతన్యరథం): కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పరిశీలించారు. తూర్పు నియోజకవర్గ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్, విజయవాడ పార్లమెంటు జనసేన ఇన్ఛార్జి అమ్మిశెట్టి వాసుతో కలిసి నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లను రవినాయుడు పరిశీలించారు. ఆంధ్రా లయోలా కాలేజీ సమీపంలోని 106, 107, 108 పోలింగ్ బూత్ సెంటర్లు, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని 109 పోలింగ్ బూత్ సెంటర్, కోర్టు కాంప్లెక్స్ సమీపంలోని 89, 89ఏ, 91, 92, 93, 110 పోలింగ్ బూత్ సెంటర్లు, కృష్ణలంక హైస్కూల్ దగ్గరున్న 90నెంబరు పోలింగ్ బూత్ సెంటర్, పటమటలోని రైతుబజార్ దగ్గరున్న 116, 117, 118, 119, 120, 121 నెంబరు పోలింగ్ బూత్ సెంటర్లను నేతలు సందర్శించి పోలింగ్ సరళిపై వివరాలు తెలుసుకున్నారు.

## విశాఖ బీచ్‌లో అనుకోని ఘటన... స్నానం చేస్తుండగా సముద్రంలోకి లాక్కెళ్లిన అలలు



విశాఖ (చైతన్యరథం): ఆర్కే బీచ్‌లో సముద్రస్నానం చేసేందుకు వచ్చి నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని లైఫ్ గార్డ్‌లు కాపాడారు. రాసపువానిపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ నూకరాజు శివరాత్రి సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి సముద్ర స్నానానికి వచ్చారు. స్నానం చేస్తుండగా సముద్రపు అలలు నూకరాజును సముద్రంలోకి లాక్కెళ్లాయి. స్పందించిన లైఫ్ గార్డ్ లు వెంటనే సముద్రంలోకి పడవలతో వెళ్లి బాధితుడిని కాపాడి ప్రథమ చికిత్స చేశారు. ప్రస్తుతం నూకరాజు ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది.

## పాడేరులో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు... 88.04 శాతం ఓటింగ్

పాడేరు (చైతన్యరథం): జిల్లాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. వాడే డివిజన్ పరిధిలో 11 మండలాల్లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 88.04% పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. రంపచోడవరం చింతూరు డివిజన్లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 77.90% ఓట్లు నమోదు అయినట్లు తెలిపారు. 22 మండలాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందనీ చెప్పారు.



## ఘనంగా రాజయ్యపేట నూకతాత జాతర... పాల్గొన్న రాష్ట్ర హెూంమంత్రి అనిత



నక్కపల్లి : అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో నూకతాత జాతర గురువారం వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో హెూంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. స్థానిక మత్స్యకారుల ఆరాధ్య దైవంగా పేరొందిన ఈ స్వామి జాతరను ఏటా మహాశివరాత్రి అమావాస్యను పురస్కరించుకుని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా నూకతాత ప్రతిమలకు సముద్ర స్నానం చేయించి కాలినడకన సుమారు మూడు కిలోమీటర్ల దూరం తీసుకుని వచ్చి ఇక్కడ గుడిలో ఉంచుతారు. భక్తులు నేలపై పడుకోనగా వీరిపై నుంచి నూకతాత ప్రతిమలతో పూజారులు నడిచి వెళుతుంటారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు మంత్రి అనిత కూడా పాల్గొన్నారు. జాతరను తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలివస్తుంటారు.

## విజయనగరంలో 94.05 శాతం ఓటింగ్.... ప్రశాంతంగా ముసిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు

విజయనగరం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా జిల్లాలోని 29 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఉదయం 8 గంటలకు ఆయా కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ పూర్తయిన అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 94.05శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని మొత్తం 5223 ఓట్లకుగాను 4912 ఓట్లు పోలైనట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు.



# తుది దశకు చేరుకున్న ఏపీ బడ్జెట్ కసరత్తు



ఏపీ బడ్జెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ బడ్జెట్‌కు ముఖ్య లక్ష్యం రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 15 శాతం సాధించడం, 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడమే. ఇందుకోసం మూలధన వ్యయాన్ని పెంచుతూ, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తమ పథకాల అమలుకు తగినంత నిధులు కేటాయించడమే కాకుండా, వాటి ఆర్థిక ప్రభావాన్ని సమీక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్దపీట వేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కీలకమైనవి. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరికొన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని ప్రకటించారు. ఈ హామీల అమలుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

రాజధాని అభివృద్ధిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం మూడేళ్లలో రూ.60,000 కోట్ల వ్యయంతో అమరావతిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలకు హామీ తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సందర్భంగా దీనిపై మరింత క్లారిటీ ఇవ్వనుంది. పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, పరిశ్రమల వృద్ధి, పునరుత్పత్తి శక్తి రంగాల్లో పెట్టుబడులు బడ్జెట్‌లో ముఖ్య ప్రాధాన్యత పొందనున్నాయి. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌ల అభివృద్ధి, తయారీ పరిశ్రమల వృద్ధి తదితర రంగాల్లో ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

## నీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక చర్యలు

**●గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం**



శ్రీకాకుళం (చైతన్యరథం): జిల్లాలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షణ అధికారికి ఈ మేరకు చరవాణిలో మాట్లాడి జిల్లా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న రక్షిత మంచినీటి పథకాలను మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా ఉద్దాన ప్రాంతానికి తాగునీరు అందిస్తున్న ప్రధాన రక్షిత మంచినీటి పథకం పనితీరును మంత్రివర్యులు అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో ఇతర మండలాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలు పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బోరు బావులు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. తాగునీటి అవసరాలకు నిధులు కొరత లేదని ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే విజయ్‌చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే విజయ్‌చంద్ర పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పలు బూత్‌లను పరిశీలించిన ఆయన... ఓట్లకు స్వయంగా ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. అమూల్యమైన ఎమ్మెల్సీ ఓటును సద్వినియోగం చేసుకోవాలని విజయచంద్ర కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏపీటీఎఫ్ సంఘ నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ చెల్లారపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, జయప్రకాశ్ నారాయణ, గుంట్రెడ్డి రవికుమార్, బోను చంటి, కోరాడ నారాయణరావు, కోలామధు, డాక్టర్ భానుప్రసాద్, రాజశేఖర్, భాష, గణేష్, రౌతు వేణుగోపాల్ నాయుడు, అరవింద్, నీరస జ్యోతి, బలరాం, సింహాలనాయుడు, పెంట సత్యం, తెరాజమ్మ, భాస్కర్ రావు, నాగభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ప్రగడ నాగేశ్వరరావు



యలమంచిలి (చైతన్యరథం): నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా అచ్యుతాపురం ఎన్నికల కేంద్రంను రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. పోలింగ్ సరళిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మధుసూదన్, మండల అధ్యక్షులు జనపరెడ్డి నరసింగరావు, మెరుగు బాపునాయుడు, పీలా తులసిరాము, జనసేన నాయకులు బైలపూడి రామదాసు, రాజాన నానాజీ, ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు, పుర్రె శ్రీను, పతివాడ చిన్నయనాయుడు, కోలా మహేష్, లాలం రాము, ఏపీటీఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్బవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న పంచకర్ల

సబ్బవరం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో సబ్బవరంలో 109 పోలింగ్ నమోదు అయ్యింది. ఇప్పటి వరకు 44 మంది అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సబ్బవరంలోని కూటమి బలపరిచిన పాకల పార్టీ రఘువర్మ శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పెందుర్తి నియోజకవర్గం అత్యధిక ఓటర్లు కలిగి ఉందని తెలిపారు. కూటమి బలపరిచిన అభ్యర్థి గెలుపొందడం ఖాయమన్నారు.

# చంద్రబాబు పాలన పట్ల పట్టభద్రులు సంతృప్తి

●ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎంఎంకెఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 429 బూత్‌లో మంత్రి రామానాయుడు ఓటు వేశారు. అనంతరం ఆయన నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ప్రథమ ప్రాధాన్యత ఓటుతో మంచి మెజార్టీతో విజయం సాధిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీల మేలు కలయికను పట్టభద్రులు ఓటు ద్వారా కూటమి ప్రభుత్వాన్ని ఏకపక్షంగా సమర్థిస్తున్నట్లుగా ఓటింగ్ సరళి వెల్లడవుతుందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో 14 లక్షల కోట్ల అప్పుగించిన నేడు చంద్రబాబు ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనపై నమ్మకంతో వెళ్లిన పరిశ్రమలతో పాటు కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాబోతున్నాయన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీతో పాటు నిరుద్యోగ యువతీ యువకులకు వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కల్పిస్తున్నట్లు మంత్రి రామానాయుడు తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ట్రెనింగ్ కళాశాలలో గురువారం ఉదయం ఓటు వేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కును గ్రాడ్యుయేట్లు అందరూ సద్వినియోగపరచుకోవాలని ఓటు హక్కు యొక్క విలువను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయడానికి ముందుకు రావాలని కోరారు. స్థానిక టీడీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

# పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే చినరాజప్ప



పెద్దాపురం (చైతన్యరథం): ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పెద్దాపురం, సామర్లకోటలోని పోలింగ్ కేంద్రాలను, పోలింగ్ సరళిని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం పరిశీలించారు. కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల గెలుపు ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కర్రి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం తన ఓటు హక్కును నిడదవోలు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, టీడీపీ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు వినియోగించుకున్నారు. కూటమి బలపరిచిన అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బూరుగుపల్లి శేషారావు వెల్లడించారు.



# నా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నాను : ఎమ్మెల్యే ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): పట్టభద్రులంతా వివేకంతో, విజ్ఞతతో ఆలోచించి పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేస్తున్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. గురువారం ఉదయం ట్రెనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మండలి ఎన్నికల పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ఎన్డీయే కూటమిని బలపరిచేందుకు కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం అందరి బాధ్యత అన్నారు. ఇప్పటికే అనేక మంది పట్టభద్రులు ఓటు వేయడానికివస్తున్నామని, ఇది తమ బాధ్యత అని ఫోన్లు చేసి చెబుతున్నారని, ఇది మంచి పరిణామమని హర్షం వ్యక్తం చేశారు. పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులను తక్కువ చేయడమో, కించపరచడమో తమ ఉద్దేశం కాదని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయవచ్చని, అయితే ప్రస్తుతం నష్టాలు, కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకు వెళుతున్న కూటమి ప్రభుత్వాన్ని బలపరచడం అందరికి అవసరమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అందుకే తన ఓటును సద్వినియోగం చేసుకున్నానని అన్నారు.

# గోదావరి బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



తాళ్లపూడి (చైతన్యరథం): బుధవారం తాళ్లపూడి మండలంలోని తాడిపూడిలో ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతయి మృతిచెందిన ఐదుగురు యువకుల కుటుంబాలను టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు, కూటమి నాయకులు గురువారం బాధిత కుటుంబాల దగ్గరకు వెళ్లి పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ.. మృతిచెందిన యువకుల జీవితాలను వెలకట్టలేమని, మంచిగా చదువుకుని ఉన్నతస్థాయిలో తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకుని వస్తారనుకుంటే అర్ధంతరంగా ప్రమాదవశాత్తు వారి జీవితాలు ఇలా ముగిసిపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం నుంచి అన్నీ రకాలుగా ఆదుకుంటాం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో మాట్లాడి త్వరితగతిన బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**బాధిత కుటుంబాలకు నామా కొండబాబు ఆర్థిక సాయం**

తాళ్లపూడి మండలంలోని తాడిపూడిలో ప్రమాదవశాత్తు గోదావరి నదిలో గల్లంతయి మృతి చెందిన ఐదుగురు యువకుల బాధిత కుటుంబాలకు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నామా కొండబాబు తక్షణ సాయం గురువారం అందజేశారు. చెన్నై నుంచి హుటాహుటిన ఇక్కడకు విచ్చేసిన ఆయన ఒక్కో కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.25 వేలు చొప్పున రూ.1.25 లక్షలు అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబుతో మాట్లాడి ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం వచ్చేలా దృష్టిసారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దన రాధాకృష్ణ సురేంద్ర, సుదీర్ కుమార్, అనపందు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేశాం : కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ



ఏలూరు (చైతన్యరథం): తెలుగుదేశంపార్టీలో క్రమశిక్ష కలిగిన నాయకుడు పేరబత్తుల రాజశేఖరంను ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా ప్రకటించినినాటి నుండి ఎన్డీయే కూటమిపక్షాల నాయకులు వారి గెలుపుకోసం విశేషకృషి చేశారని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పెరాభత్తుల రాజశేఖరం సామాన్య కార్యకర్తగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ నేడు జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా పోటి చేసి అత్యధిక మెజార్టీతో గెలవనున్నారని తెలిపారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాభత్తుల రాజశేఖరం మాట్లాడుతూ... కూటమి అభ్యర్థిగా ఎన్డీఏ ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి మద్దతుతో ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీచేసిన నాకు అత్యంత ఆదరణతో జరిగిన ఎన్నికలలో పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ... గత నాలుగు నెలలుగా ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి పేరాభత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేసిన ఎన్డీయే కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్



జగ్గంపేట (చైతన్యరథం): ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అతి విలువైన హక్కు అని, ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ కోరారు. గురువారం జగ్గంపేటలో 13,14,15 బూతులలో ఎమ్మెల్సీ ఎన్నికల శిబిరాలను జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌తో కలిసి సందర్శించారు. ఎన్డీయే శ్రేణులతో కలిసి జగ్గంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల జరుగుతున్న మండల కేంద్రాలను సందర్శనలో భాగంగా జగ్గంపేట పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళిపై ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకుని, ఓటింగ్ శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధిక శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచనలు ఇచ్చారు. ఉదయం నుంచి టీడీపీ శ్రేణులను అప్రమత్తం చేసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు సునాయాసంగా దక్కేలా సూచనలు, సలహాలు, ఇచ్చారు. ఎన్నికల నియమావళిని గౌరవిస్తూ, ఎన్నికల సంఘం వారికి, పోలీసులకు సహకరించాలని శ్రేణులకు సూచనలు చేశారు. పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని నెహ్రూ, నవీన్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, బుర్రి సత్తిబాబు, రేఖ బుల్లి రాజు, వేములకొండ జోగారావు,ముసిరెడ్డి నాగేశ్వరరావు, పీలా మహేష్ మండల టీడీపి మహిళా అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యవతి అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నిక... భారీగా పెరిగిన పోలింగ్ శాతం




అమరావతి (చైతన్యరథం): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్లు వేసేందుకు తరలిరావడంతో 69.57 శాతం పోలింగ్ నమోదైంది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని.. తప్పకుండా విజయం సాధిస్తానని ఆలపాటి ధీమా వ్యక్తం చేయగా.. తమ ఏజెంట్లపై దాడులు జరిగాయని లక్ష్మణరావు ఆరోపించారు. బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్లకు తరలిస్తున్నారు. మార్చి 3వ తేదిన ఓట్ల లెక్కింపు జరగనుంది. గతంలో నమోదైన 59.95 శాతంతో పోలిస్తే ఈసారి 10 శాతం ఎక్కువగా పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 3,47,116 మంది ఓటర్లకు గాను.. 2,41,502 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాల వారీగా చూస్తే.. ఏలూరు జిల్లాలో 73.30శాతం, కృష్ణా జిల్లాలో 69.91శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 65.69 శాతం, గుంటూరు 66.45 శాతం, బాపట్ల 74.30 శాతం, పల్నాడు 77.33 శాతం పోలింగ్ నమోదైంది.

## మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ముగిసిన పోలింగ్... మార్చి 3వ తేదిన ఫలితాలు

రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మార్చి మూడో తేదీన ఫలితాలు వెలువడనున్నాయి.

రాష్ట్రంలో రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల స్థానంలో అధికార కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా, పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. గుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఇద్దరు అభ్యర్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంతకుముందు పోలింగ్ కేంద్రం ఆవరణలో పీడీఎఫ్ అభ్యర్థి తరపున ఏర్పాటుచేసిన టెంట్‌కు లక్ష్మణరావుకు ఓటేయండి అనే స్టిక్కర్లు ఉండటంతో టీడీపీ నేతలు అభ్యంతరం తెలిపారు. జోక్యం చేసుకున్న పోలీసులు స్టిక్కర్లును తీసేయించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటేసి బయటకొచ్చిన చంద్రబాబు, లోకేశ్‌ని కలిసేందుకు జనం ఇళ్లలోంచి పెద్దఎత్తున బయటకు వచ్చారు. అందరినీ ఆప్యాయంగా పలకరించిన సీఎం, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు, చిన్నారులు సీఎంతో ఫొటోలు దిగారు. ఈ క్రమంలో ఓ చిన్నారిని సీఎం ఎత్తుకుని ఫొటో దిగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నాదెండ్ల మనోహర్ వేర్వేరుగా వచ్చి ఓటేశారు. గుంటూరులోని పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ నాగలక్ష్మి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, చిలకలూరిపేట ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఓటేశారు. విజయవాడలోని కోనేరు బసవపున్నయ్య చౌదరి హైస్కూల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి సాధారణ ప్రజలతో పాటు క్యూలైన్‌లో నిల్చుని ఓటేశారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో మాజీ మంత్రి దేవినేని ఉమా ఓటేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం హిందూ కళాశాలలో సాధారణ ప్రజలతో కలిసి క్యూలైన్‌లో నిలబడి వెళ్లి ఓటేశారు. గన్నవరంలో స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు, గుడివాడ ఎస్పీఎస్ మున్సిపల్ పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సాధారణ ప్రజలతో పాటు క్యూలైన్‌లో నిల్చుని వెళ్లి ఓటేశారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, బంటుమిల్లి జూనియర్ కాలేజీలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ దంపతులు ఓటేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, అయన కుటుంబ సభ్యులు పామర్రు జడ్పీ హైస్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కైకలూరులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఓటు వేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఆకివీడు ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తణుకులోని బాలుర ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీసమేతంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏలూరు జిల్లా జీలుగుమిల్లి జెడ్పీ పాఠశాలలో ఓటేశారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కూడా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కాకినాడ జిల్లా తొండంగిలో ఓటేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్.

## ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి : కేంద్రమంత్రి పెమ్మసాని



తెనాలి (చైతన్యరథం): "ఓటు హక్కు విలువ తెలిసిన వాళ్ళం కాబట్టి ఢిల్లీలో ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా కేంద్ర మంత్రులతో సమావేశాలు ఉన్నా అన్నిటినీ పక్కనపెట్టి నేను నా ఓటు వేయడానికి వచ్చాను." అని గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ఉమ్మడి గుంటూరు – కృష్ణాజిల్లాలలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని తన ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు. తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హై స్కూల్‌లో ఆయన తన ఓటు వేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మేధావులు, విజ్ఞానవంతులు, సమాజ శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు వెయ్యటానికి ఒక్క గంట సమయం వేచించాలని కోరారు. పట్టభద్రులు వేసే ఈ ఓటు విలువ 6ఏళ్ల అభివృద్ధికి ఉత్తమిస్తుందని గుర్తు చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించబోతున్నాం : ఎమ్మెల్యే గళ్ళామాధవి



గుంటూరు (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఘన విజయం సాధించబోతున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం గుంటూరు స్టాల్ గర్ల్స్ హైస్కూల్ నందు ఓటు హక్కును ఎమ్మెల్యే గళ్ళా మాధవి వినియోగించుకున్నారు. అనంతరం నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు 213వ నంబరు బూతులో ఓటువేసి నా ఓటు హక్కును వినియోగించుకున్నానని, 100% ఆలపాటి రాజేంద్రప్రసాద్ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎక్కడ ఆటంకాలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరుగుతుందని, అధికారులు ఏర్పాట్లు చాలా చక్కగా చేశారని సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజాస్వామ్యం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకోవాలి



గన్నవరం (చైతన్యరథం): ఎమ్మెల్సీ పోలింగ్‌లో భాగంగా గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన సతీమణి జ్ఞానేశ్వరితో కలసి పోలింగ్ కేంద్రానికి వచ్చి ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ... ఓటు అనేది ప్రజాస్వామ్యం ఇచ్చిన హక్కు అని ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా ఓటు వేసేందుకు ముందుకు రావాలని అన్నారు. అక్షరాస్యులు ఓటు వేసేందుకు ముందుకు వస్తే ప్రజాస్వామ్యం ప్రధవిల్లుతుందని చెప్పారు. ప్రజాస్వామ్యం ఇచ్చిన హక్కు ఓటు.. ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఓటింగ్ శాతం ఎక్కువ వచ్చేలా ప్రతి ఒక్కరు బాధ్యతతో పని చేయాలని యార్లగడ్డ సూచించారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నక్కా ఆనందబాబు



గుంటూరు జిల్లా తెనాలిలో ఉమ్మడి కృష్ణా – గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చెంచుపేటలోని జెడ్పీటీసీ స్కూల్, మారిసుపేటలోని జెడ్పీటీసీ పాఠశాల, ఐతానగర్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు గురువారం పరిశీలించారు. అంతకు ముందు గుంటూరులోని లూర్దు హైస్కూల్‌లో తన ఓటు హక్కును కుటుంబ సమేతంగా వినియోగించుకున్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న వర్ల రామయ్య



కృష్ణా జిల్లా పామర్రు గ్రామంలోని హైస్కూల్‌లో ఎమ్మెల్సీ పట్టబద్రుల ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కును వినియోగించుకున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్లరామయ్య. కూటమి బలపరచిన అభ్యర్థి గెలుపు ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం బలపరిచన వ్యక్తి గెలుపుపై తమకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పటమట రైతుబజార్ వద్ద గల కోనేరు బసవపున్నయ్య చౌదరి హైస్కూల్‌లో కేశినేని శివనాథ్, సతీమణి కేశినేని జానకి లక్ష్మితో కలిసి సాధారణ ఓటర్స్ లాగా క్యూ లైన్‌లో నిలబడి ఓటేశారు. ఎన్నికల నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్లును పరిశీలించి ఎంపీ కేశినేని శివనాథ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్నికల అధికారులను కోరారు.

# కనిగిరిని కనకపట్టణంగా తీర్చిదిద్దుకుందాం

**- పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర**



కనిగిరి (చైతన్యరథం): కనిగిరిని కనకపట్టణంగా తీర్చిదిద్దుకుందాం కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పటు చేసిని తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి బూత్ ఇన్చార్జ్‌లకు క్యూర్ కోడ్ స్కాన్ చేసి సభ్యత్వ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఒక్కటై ముందుకు సాగుదాం, పార్టీని మరింత బలంగా నిలబెట్టుదాం అని, తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందని, సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు సభ్యత్వ కార్డు అందజేయాలన్నారు. మీకు ఎల్లవేళలా అండగా ఉంటాను. కనిగిరిని కనకపట్టణంగా తీర్చిదిద్దుకుందామని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి కార్డులు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జ్‌లు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించండి

**- కలెక్టర్ కలిసి విన్నవించిన టీడీపీ ఇన్‌ఛార్జ్ ఎరిక్షన్ బాబు**



యర్రగొండపాలెం, (చైతన్యరథం): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాని కలిసి యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు. ఈ సందర్భంగా ముఖ్యంగా జగనన్న కాలనీలలో బినామీ ప్లాట్ల రద్దు, పట్టణంలోని ఉర్దూ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేయడం, గ్రామాలలో నీటి సమస్యలు వంటివి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం

**- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**- బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక చేయూత**

**- పేదల కళ్ళల్లో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**



కోవూరు (చైతన్యరథం) బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. నెల్లూరు మాగుంట లే అవుట్ లోని విపిఆర్ నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలో" ప్రధానమంత్రి అను సూచిత్ జాతి అభ్యుదయ యోజన" పథకం ద్వారా ఎంపిక అయిన 16 మంది ఎస్సీ సోదర సోదరీమణులకు 35 లక్షల రూపాయల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడ్డ ఎస్సీ సోదర సోదరీమణులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్రంలోని కూటమి ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని ఆచరణలో నిరూపిస్తున్నారని ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కొనియాడారు. స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పిడి నాగరాజకుమారి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, టిడిపి మండల నాయకులు ఇంతా మల్లారెడ్డి, బత్తుల హరికృష్ణ, ఎంవి శేషయ్య, రావెళ్ల వీరేంద్ర నాయుడు, బెజవాడ వంశి కృష్ణా రెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డిలతో పాటు నియోజకవర్గ పరిధిలోని వెలుగు సిసిలు పాల్గొన్నారు.

# కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**



కందుకూరు, (చైతన్యరథం) : కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ అధిక ప్రాధాన్యత నిస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మంగా నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం సంబంధించిన సభ్యత కార్డులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నాయకులకు,కార్యకర్తలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి లేనివిధంగా కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని చెప్పారు.పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు,జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం ఉండి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి అండగా ఉండేందుకు 5 లక్షల రూపాయల ప్రమాద బీమాను కల్పించడం జరుగుతుందన్నారు.ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబ పిల్లలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతూ, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.

# చిత్తూరు అభివృద్ధిపై వైసీపీ నాయకులు చర్చకు సిద్ధమా

**- తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ సవాల్**



చిత్తూరు (చైతన్యరథం): 8 నెలలలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కూట మీ చేసిన అభివృద్ధి ఐదేళ్లలో వైసిపి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ సవాల్ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బిసి నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరుకు మంచి చేస్తున్న గురజాల జగన్మోహన్ గురించి నోటికి వచ్చినట్లు నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. అసెంబ్లీలో ఏమైనా మాట్లాడదలచుకుంటే మీ ఎమ్మెల్యేలు మాట్లాడాలని చిత్తూరులో కూర్చుని నలుగురితో ప్రెస్ మీట్ పెట్టి విమర్శిస్తారని ప్రశ్నించారు. ప్రజలు మిమ్ములను గమనిస్తున్నారని గుర్తుపెట్టుకుంటారని అన్నారు. అసెంబ్లీలో చిత్తూరుకు త్రాగునీటి కోసం అడవి పల్లి రిజర్వాయర్ గురించి మాట్లాడారని ఐదు సంవత్సరాలలో ఏనాడైనా మాట్లాడారని ప్రశ్నించారు. ఐదు సంవత్సరాలలో చిత్తూరు నగర పరిధిలో జరిగిన అభివృద్ధికి కూటమి ప్రభుత్వ హయాంలో ఎనిమిది నెలల్లో జరిగిన అభివృద్ధికి ఎన్నో రెట్లు మేలని దానిని ఓర్వలేక నిందారోపణలు చేయడం తగదన్నారు. ఆరు కోట్లతో 191 మందికి రైతులకు గోకులం షెడ్లు నిర్మించామన్నారు గుడిపాల మండలంలో సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు ఇ ఉవన్నీ అభివృద్ధి కాదా అని వారు ప్రశ్నించారు. నిందారోపణ చేయడం తగదని అభివృద్ధికి సూచనలు చేస్తే బాగుంటుందని వరుణ్ కుమార్ సూచించారు. ఈ సమావేశంలో నగర బీసీ సెల్ నాయకులు ఈశ్వర్, కార్పొరేటర్ అశోక్, మాజీ కార్పొరేటర్ సీఎం విజయ, రూరల్ బీసీ నాయకులు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం మహా పుణ్య కార్యం

**గోపూజ, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి మండిపల్లి**





చిన్నమండెం, (చైతన్యరథం): అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహా పుణ్య కార్యమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నమండెం మండలం, దేవగుడిపల్లెలో శ్రీ శ్రీ శ్రీ మాలేపెద్దయ్యస్వామి తిరుణాల మహోత్సవం సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. దేవగుడిపల్లెలో శ్రీ శ్రీ శ్రీ మాలేపెద్దయ్యస్వామి తిరుణాల మహోత్సవం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, రాబోయే రోజులలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు. సాంప్రదాయబద్ధంగా గోపూ జలు చేసి మహా అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ తిరుణాల మహోత్సవం టీడీపీ నాయకులు, కార్యకర్తల సహకారంతో అత్యంత ఘనంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషంగా ఉందని మంత్రి మండిపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మంత్రి మండిపల్లి కృతజ్ఞతలు తెలిపారు.



# వైభవంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల తెప్పోత్సవం

శ్రీకాళహస్తీ, (చైతన్యరథం): శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లకు నారద పుష్కరణిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొజ్జల మాట్లాడుతూ స్వామి అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

# సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది

## రాతిదూలం లాగుడు పోటీల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత



- గ్రామీణ ప్రాంత సాంప్రదాయ పోటీలు ఎప్పటికీ మరువకూడదు
- బి.యాలేరు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు
- పరిటాల రవీంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రాతి దూలం లాగుడు పోటీలు
- విజేతలకు ట్రస్టు తరుపున నగదు బహుమతులు



రాప్తాడు (చైతన్యరథం): గ్రామీణ ప్రాంత సాంప్రదాయ పోటీలు ఇటీవల కాలంలో కనుమరుగవుతున్నాయని.. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు తరుపున శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. ముందుగా గ్రామస్థులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత రాతిదూలం లాగుడు పోటీలను వీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఎద్దు రాతి దూలాన్ని లాగుతుండగా ఈలలు, కేకలు వేస్తూ అక్కడున్న వారు ఉత్సాహపరిచారు. ఈ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సునీత బహుమతులు ప్రధానం చేశారు. తోపుదుర్తి చెన్నప్ప ఎద్లకు మొదటి బహుమతిగా 50వేలు, గార్లదిన్నె రామాంజనేయులు ఎద్లకు 2వ బహుమతిగా 40వేలు, కట్టకిందపల్లి ఆచారి ఎద్లకు 3వ బహుమతిగా 30వేలు, సోమలదొడ్డి రామసుబ్బారెడ్డి ఎద్లకు 4వ బహుమతిగా 20 వేలు, ధర్మవరం రవీంద్రారెడ్డి ఎద్లకు 5వ బహుమతిగా 10వేలు చొప్పున అందజేశారు. అనంతరం పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత గతంలో గ్రామాల్లో పండుగ వచ్చిందంటే చాలా రకాలు పోటీలు, ఆటలు ఉండేవని ప్రస్తుతం అవన్నీ కనిపించడంలేదన్నారు. పల్లె సాంప్రదాయాన్ని చాలా మంది మర్చిపోతున్నారన్నారు. అందుకే రాతిదూలం లాగుడు పోటీలు, ఇతర వాటిని నిర్వహించేందుకు పరిటాల రవీంద్ర ట్రస్టు ముందుకొచ్చిందన్నారు. గ్రామస్థులు ఐక్యంగా పండుగులు, ఇలాంటి పోటీలు నిర్వహించుకోవాలని ఆమె సూచించారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణంపై మంత్రి సవిత దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి
- గాయపడిన మరో యువకుడికి మెరుగైన వైద్యమందించండి
- ఏఆర్ ఆసుపత్రి వైద్యులకు మంత్రి ఆదేశం
- ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించండి
- పోలీసులకు మంత్రి సవిత ఆదేశం



పెనుకొండ, (చైతన్యరథం) : కర్నాటక రోడ్డు ప్రమాదంలో రొద్దం మండలానికి ఇద్దరు యువకులు మృతి చెందడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రొద్దం మండలానికి చెందిన చరణ్(18), తిరుమలేష్(20), భరత్ బుధవారం రాత్రి లేపాక్షి కి జబర్దస్త్ టీంను చూడడానికి బైకులో వెళుతూ మార్గం మధ్యలో కర్నాటక రాష్ట్రానికి చెందిన దొమ్మితిమర్రి గ్రామం దగ్గర రోడ్డు ప్రమాదానికి గురవ్వడం బాధాకరమన్నారు. ఈ దుర్ఘటనలో చరణ్(18), తిరుమలేష్(20) దుర్మరణం పాలవ్వడంపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భరత్‌కు మెరుగైన వైద్యమందించాల ని హిందూపురంలోని ఏఆర్ ఆసుపత్రి వైద్యులకు ఫోన్ లో మంత్రి ఆదేశించారు. ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం ఆచూకీ కనుగొని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మంత్రి సవిత ఆదేశించారు.

*మదనపల్లి నియోజకవర్గం వేంపల్లి గ్రామం మల్లయ్యకొండ శివాలయం నందు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామి నాయుడు, తెలుగు యువత నాయకులు మహబూబ్ ఖాన్, శ్రీకాంత్, శశి, ప్రకాష్ పాల్గొన్నారు.*





## ఆత్మహత్యలు వద్దు, బంగారు భవిష్యత్తే ముద్దు

### - టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరించిన కడప జాయింట్ కలెక్టర్

కడప (చైతన్యరథం): విద్యార్థులు ఆత్మహ త్యలు మాని బతికి సాధించాలని, ఉన్నత లక్ష్యాలతో బంగారు భవిష్య త్తును ఎంచుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. "ఆత్మహత్యలు వద్దు - బ్రతికి సాధిద్దాం" అని కడప జిల్లా టిఎన్ఎ స్ఎఫ్ రూపొందించిన పోస్టర్లను గురువారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ కలెక్టరేట్లోని తమ చాంబర్లో ఆవిష్కరించారు. ప్రస్తుతం విద్యార్థులను చైతన్య పరుస్తూ మంచి అవగాహన కార్యక్రమాన్ని రూపొందించిన టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ ను అభినం దించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు అనవసరమైన భయాందోళనలు, అవమా నాలు, చదువు ఒత్తిడి వీటితో ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తొందరపాటు నిర్ణయాలతో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని, మంచిగా చదువుకొని వివిధ రంగాలలో నిష్ణాతులుగా తయారై ఉజ్వల భవిష్యత్తును పొంది తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు




తీసుకురావాలని అన్నారు పోస్టర్ల ఆవిష్కరించిన వారిలో టిఎన్ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి హమీద్, కార్యదర్శి అక్షయ్ కుమార్ రెడ్డి, నాయకులు బిల్లా నవీన్, రఘు, లక్ష్మణ్, ఫక్రుద్దీన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## బత్తలపల్లిలో రోడ్డు ప్రమాదం

### గొర్రెల మందపై దూసుకెళ్లిన లారి.. 27 గొర్రెలు మృతి

బత్తలపల్లి (చైతన్యరథం): రోడ్డు ప్రమాదం కారణంగా గొర్రెలు చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయిన గొర్రెల యజమాని నారాయణ స్వామికి ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయం ఇన్చార్జి హరీష్ బాబు అధికారులను ఆదేశించారు. తిప్పేపల్లి గ్రామానికి చెందిన అరివేటి నారాయణ స్వామి గొర్రెల మందపై ఐచర్ వాహనం దూసుకెళ్లడంతో 27 గొర్రెలు మృతి చెందాయి.



అనంతపురం-చెన్నై జాతీయ రహదారిలోని తంబాపురం సమీపంలో ఐచర్ వాహనం దూసుకెళ్లడంతో 27 గొర్రెలు మృతి చెందాయి. ఈ విషాదకర సంఘటనను తెలుసుకున్న మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా, హరీష్ బాబు పోలీస్ అధికారులతో మాట్లాడి ప్రమాదం జరిగిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, అనిమల్ హస్బండ్రీ జేడితో, ఆర్‌డీఓతో చర్చించి గొర్రెల యజమాని అరివేటి నారాయణ స్వామికి తగిన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గొర్రెల యజమాని అరివేటి నారాయణ స్వామి, ఈ ప్రమాదంలో తన గొర్రెలు కోల్పోయి తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున వీలైనంత త్వరగా సహాయం అందించడం అత్యవసరమని చెప్పారు.

హరీష్ బాబు ఈ విషాద ఘటనపై తీవ్ర దిగులును వ్యక్తం చేస్తూ, నారాయణ స్వామికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ కొనసాగించాలని పోలీసు అధికారులను కోరారు.

## శివరాత్రి ఉత్సవాల్లో పరిటాల శ్రీరామ్

- శ్రీకాటకోటేశ్వర స్వామిని దర్శించుకున్న శ్రీరామ్
- వీరనారాయణస్వామి ఉత్సవంలో పాల్గొన్న శ్రీరామ్
- ఎద్ల బండి పై ఆలయం చుట్టూ ప్రదక్షణలు
- పరమశివుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్ష



ధర్మవరం (చైతన్యరథం): శివరాత్రి సందర్భంగా నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో జరిగిన ఉత్సవాల్లో తెలుగుదేశంపార్టీ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ముందుగా ముదిగుబ్బ మండలం సంకేపల్లి పంచాయతీలోని గొంగట లింగయ్యగారి పల్లిలో జరిగిన వీర నారాయణస్వామి ఉత్సవానికి హాజరయ్యారు. శ్రీరామ్ కు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. ఆలయంలో వీరనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఎద్లబండి పై ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఆ తర్వాతి చిల్లవారిపల్లి శ్రీ కాటకోటేశ్వర స్వామి క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. జిల్లాలో నలుమూలలు నుంచే కాకుండా రాయలసీమలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో క్షేత్రం కిక్కిరిసిపోయి కనిపించింది. ఆలయ నిర్వాహకులు, పూజా కార్యక్రమాలు నిర్వహించే వారు శ్రీరామ్ కు ఘనస్వాగతం పలికారు. ముందుగా కాటమయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, అధికారులతో ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులను శ్రీరామ్ పలుకరించారు. భక్తులు సంయమనంతో ఉండి స్వామి వారిని దర్శించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గ ప్రజలపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

# మహా కుంభమేళాలో అసౌకర్యానికి గురైతే మన్నించండి

## భక్తులకు ప్రధాని మోదీ క్షమాపణలు - భారతీయ ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం

ఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ మహా కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా.. అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని



మోదీ విజ్ఞప్తి చేశారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10న, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

### 66.21 కోట్ల మంది పుణ్యస్నానాలు

మహా శివరాత్రి సందర్భంగా మహా కుంభమేళా బుధవారంతో ముగిసింది. జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు సాగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో 66 కోట్లకు పైగా మంది భక్తులు పుణ్యస్నానం ఆచరించినట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద 66.21 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అఖాడాలు, సాధువులు, మహామండలేశ్వర్ల ఆశీర్వాదంతో ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. చరిత్రలో నిలిచిపోయే ఈ మహా కుంభమేళాలో భాగమైన భక్తులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ద్వారా ఏకంగా రూ. 3లక్షల కోట్లకు పైగా బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. తద్వారా ఇది దేశంలో అతిపెద్ద ఆర్థిక కార్యక్రమాలలో ఒకటిగా నిలిచింది. కాగా, మహా కుంభమేళా ప్రారంభానికి ముందు సుమారు 40 కోట్ల మంది భక్తులు వస్తారని, దాదాపు రూ. 2 లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతాయని ప్రాథమిక అంచనాలు ఉన్నాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) సెక్రటరీ జనరల్, బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు. అయితే, దేశ విదేశాల నుంచి అపూర్వమైన స్పందన కారణంగా ఏకంగా 66.21 కోట్ల భక్తులు పాల్గొన్నారు. దీంతో రూ. 3 లక్షల కోట్లకు పైగా భారీ బిజినెస్ జరిగింది. ఆతిథ్యం, వసతి, ఆహారం, పానీయాల రంగం, రవాణా మరియు లాజిస్టిక్స్, మతపరమైన దుస్తులు, పూజ, హస్తకళలు, వస్త్రాలు ఇతర వినియోగ వస్తువులు వంటి అనేక వ్యాపార రంగాలు పెద్ద ఎత్తున ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించాయి. మహా కుంభమేళా జరిగిన ప్రయాగ్‌రాజ్ మాత్రమే కాకుండా దాని పరిధిలోని 100 నుంచి 150 కి.మీ దూరంలో ఉన్న నగరాలు, పట్టణాలకు కూడా భారీ వ్యాపారం జరిగింది.

ఇక ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.7,500 కోట్లకు పైగా ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ తెలిపిన వివరాల ప్రకారం... 14 కొత్త ఫ్లైఓవర్లు, ఆరు అండర్‌పాస్‌లు, 200కి పైగా రోడ్ల విస్తరణ, కొత్త కారిడార్లు, రైల్వే స్టేషన్ల విస్తరణ, ఆధునిక విమానాశ్రయ టెర్మినల్ నిర్మాణానికి ఈ రూ.7,500 కోట్లు ఖర్చు చేశారు. అదనంగా కుంభమేళా ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా రూ.1,500 కోట్లు కేటాయించారు.

# నా బిడ్డకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది

- నేపాల్ విద్యార్థిని తండ్రి స్పష్టీకరణ
- భువనేశ్వర్‌లోని కీట్ వర్సిటీలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య
- వర్సిటీ అధికారులకు యూజీసీ నోటీసులు
- ఘటనపై సమగ్ర నివేదికకు ఆదేశం

భువనేశ్వర్: ఒడిశాలో కీట్ (కేఐఐటీ) విశ్వవిద్యాలయంలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. న్యాయం కోసం తోటి విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి నేపాల్ రాజధాని ఖాఠ్మండ్ నుంచి మీడియాతో మాట్లాడారు. రామాయణ కాలం నుంచి భారత్–నేపాల్ ల మధ్య విడదీయరాని అనుబంధం ఉంది. దర్యాప్తు జరుగుతున్నంత కాలం నేను ఒడిశాలోనే ఉండటం వీలుకాదు. కానీ, నా కుమార్తెకు భారత్ న్యాయం చేస్తుందని నమ్ముతున్నానని ఆయన స్పష్టం చేశారు.

తన బంధువుల ద్వారా భువనేశ్వర్లోని కీట్ విశ్వవిద్యాలయం గురించి ఆ విద్యార్థిని తెలుసుకుంది. దాంతో ఉన్నత విద్య చదివి, కుటుంబానికి అండగా నిలవాలని కీట్ విశ్వవిద్యాలయంలో బీటెక్ లో చేరింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ భారత సరిహద్దుకు 5 కి.మీ. దూరంలో ఉన్న ఖైరాహవా (నేపాల్) నుంచి వచ్చి, కీట్ విశ్వవిద్యాలయంలో చదువుతోంది. తన సోదరుడికి మంచి భవిష్యత్తును ఇవ్వాలని నా కుమార్తె తపించేది. కానీ ఇలా మధ్యలోనే తాను మాకు దూరమైంది. తన కలలన్నీ కల్లలయ్యాయి. ఆమెకు ఈ పరిస్థితి తీసుకొచ్చినవారికి శిక్ష పడాలని ఆమె తండ్రి డిమాండ్ చేశారు. ఆమె ఎవరితోను త్వరగా కలవదు కానీ.. తనను వేధించిన వారిపై ఫిర్యాదు చేసిందని చెప్పారు.

వేధించిన విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి విశ్వవిద్యాలయ యాజమాన్యం వదిలేసిందని, వారిపై తగిన చర్యలు తీసుకొని ఉంటే తన బిడ్డకు ఈ పరిస్థితి వచ్చేదే కాదని వాపోయారు. ఫిబ్రవరి 10న ఆమె చనిపోవడానికి రెండు గంటల ముందు తల్లితో మాట్లాడింది. తన చదువు గురించి చెప్పడమే గాకుండా, ఇంటి విషయాలు అడిగి తెలుసుకుంది. అప్పుడు మాకు తన మాటల్లో ఎలాంటి తేడా కనిపించలేదు. కానీ రెండు గంటల తర్వాత ఆమె ఆత్మహత్య వార్త మాకు అందిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ ఘటన తెలిసిన వెంటనే నేపాలీ విద్యార్థుల సంఘం నిరసనలకు దిగింది. దాంతో 500 మంది నేపాలీ విద్యార్థులను హాస్టళ్లు ఖాళీ చేయించారంటూ వార్తలు వచ్చాయి.

దాంతో పూర్తి వివరాలు తెలుసుకునేందుకు నేపాల్ దౌత్య కార్యాలయం తన అధికారులను పంపింది. నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి కూడా మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడారు. దర్యాప్తు గురించి భరోసా ఇచ్చారు. ఇలాఉంటే భువనేశ్వర్లోని కీట్ వర్సిటీ యంత్రాంగానికి యూజీసీ మంగళవారం నోటీసు జారీ చేసింది. కీట్లో నేపాల్ విద్యార్థిని ఆత్మహత్య తర్వాత ఇతర విద్యార్థులపై ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది చేయిచేసుకోవడం, వసతిగృహాలను ఖాళీ చేయించడంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటుచేసిన త్రిసభ్య ఉన్నతస్థాయి సంఘం.. కీట్ కు చెందిన మరో ఆరుగురు అధికారుల్ని విచారణకు హాజరురావాలని ఆదేశించింది.

# చట్టాలతోనే అన్నింటినీ నివారించలేం

## - పుణే అత్యాచార ఘటనపై జస్టిస్ చంద్రచూడ్ స్పందన



ఢిల్లీ: మహారాష్ట్రలోని పుణేలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్ర చూడ్ స్పందించారు. నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించ లేం. మహిళల కోసం తీసుకొచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలి. ఎక్కడికి వెళ్లినా తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని కలిగించాలి. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం, న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా అంతే బాధ్యత ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.

కాగా.. పుణేలో అత్యంత రద్దీగా ఉండే బస్ స్టేషన్లలో ఒకటైన స్వర్గేట్ బస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతితో నిందితుడు మాటలు కలిపాడు. అక్కా అని సంబోధిస్తూ నమ్మించాడు. గ్రామానికి వెళ్లే బస్సు మరో చోట ఉందని చెప్పి బస్ స్టేషన్లోనే దూరంగా ఎవరూ లేని చోట ఆగి ఉన్న మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్ దగ్గరకు ఆమెను తీసుకెళ్లాడు. బస్సులోకి వెళ్లేందుకు యువతి తటపటాయించడంతో లోపల ప్రయాణికులు ఉన్నారని.. నిద్రలో ఉండటంతో వాళ్లు లైట్లు వేసుకోలేదని నమ్మించాడు. బస్సులోకి యువతి ప్రవేశించగానే తలుపు వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దత్తాత్రేయ రామదాస్ (36)గా పోలీసులు గుర్తించారు. అతడిపై అనేక కేసులు ఉన్నాయని, 2019 నుంచి బెయిల్ మీద ఉన్నాడని తెలిపారు. రామదాస్‌ను పట్టుకొనేందుకు 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి దగ్గర్లో ఉన్న చెరకు తోటలో డ్రోన్లతో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కాగా, అత్యాచారం చేశాక నిందితుడు సమీపంలోనే ఉన్న చెరకు తోటలో దాక్కుని.. కాసేపయ్యాక కూరగాయలు తీసుకెళ్తున్న ట్రక్కులో తప్పించుకుని వెళ్లాడని పోలీసులు చెబుతున్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం. నిందితుడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ.లక్ష రివార్డు ఇస్తామని పుణె పోలీసులు వెల్లడించారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ శిందే స్పందించారు. ఈ కేసుపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించిందని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

# అమెరికాలో కోమాలో భారత విద్యార్థిని

- ఆ దేశం వెళ్లేందుకు తండ్రి యత్నాలు
- కేంద్రం చొరవతో అత్యవసర వీసా ఇంటర్వ్యూకు అమెరికా అంగీకారం
- నేటి ఉదయం వీసా స్లాట్ కేటాయింపు



నీలమ్ షిండే (ఫైల్ ఫోటో)

ఢిల్లీ: కోమాలో ఉన్న భారతీయ విద్యార్థిని కుటుంబం అభ్యర్థనపై అమెరికా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూకు అమెరికా అవకాశం కల్పించింది. శుక్రవారం ఉదయం 9 గంటలకు వీసా ఇంటర్వ్యూకు స్లాట్ కేటాయించింది. వీసా కోసం బాధితురాలి తండ్రి చేస్తోన్న ప్రయత్నాలు తమ దృష్టికి రావడంతో భారత విదేశాంగ శాఖ.. అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్యం నుంచి సానుకూలంగా స్పందన వచ్చింది. వీసా లేక అత్యవసర ప్రయాణానికి అనుమతి ఇవ్వాలంటూ భారత విదేశాంగశాఖ కు చెందిన అమెరికా విభాగం అక్కడి ప్రభుత్వాన్ని సంప్రదించినట్లు సమాచారం. కాలిఫోర్నియా యూనివర్సిటీలో పీజీ చేస్తోన్న నీలమ్ షిండే ఫిబ్రవరి 14న రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. కారు ఢీకొనడంతో ఆమె తల, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఉంటున్న ఆమె కుటుంబానికి ఫిబ్రవరి 16న ఈ విషయం తెలిసింది. నీలమ్ తండ్రి వెంటనే వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే చేసిన సోషల్ మీడియా పోస్టు ద్వారా ఆ కుటుంబం ఆవేదన అందరి దృష్టికి చేరింది.

నీలమ్ షిండే అనే విద్యార్థిని యూఎస్ఏలో ప్రమాదానికి గురై అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆమె తండ్రి ప్రయత్నిస్తున్నారు. ఆయన అత్యవసర వీసా కోసం దరఖాస్తు చేస్తున్నారు. ఆయనకు సహాయం చేయాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, భారత దౌత్య కార్యాలయాన్ని కోరుతున్నా.. అని ఎంపీ సుప్రియా సూలే ఎక్స్ వేదికగా కోరారు. దీనిపై భారత విదేశాంగశాఖ స్పందించి అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపింది.

# ట్రంపును కెనడాలోకి అడుగుపెట్టనివ్వొద్దు

**ఖలిస్థానీ సానుభూతిపరుడు జగ్మీత్ సింగ్ వ్యాఖ్య**

కెనడా ప్రతిపక్ష ఎన్డీపీ (నేషనల్ డెమొక్రటిక్ పార్టీ) నేత, ఖలిస్థానీ సానుభూతిపరుడు జగ్మీత్ సింగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంపును నేరస్థుడిగా అభివర్ణించారు. ఆయనను జి-7 సదస్సుకు కెనడా భూభాగంపై అడుగుపెట్టనీయకుండా బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌పై గతంలో నేర నిర్ధారణ జరిగిన అంశం, ప్రపంచ దేశాలకు ఆయన బెదిరింపులను ఇందుకు ఓ కారణంగా పేర్కొన్నారు. బుధవారం జగ్మీత్ సింగ్ మాంట్రియాల్ కౌన్సిల్ ఆన్ ఫారెన్ రిలేషన్స్ సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

"ట్రంపును జీ7 సమావేశాల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని నేను నమ్ముతున్నాను. ఆయనను ఇక్కడికి పిలవకూడదు. నేరనిర్ధారణ జరిగిన వ్యక్తిని మన దేశంలోకి ఎందుకు రానివ్వాలి. మన ప్రజాస్వామ్యానికి, సార్వభౌమత్వానికి ముప్పుగా మారి, మన ఆర్థికవ్యవస్థను, మన మిత్రులను, ప్రపంచాన్ని బెదిరించిన వ్యక్తిని ఎందుకు అనుమతించాలి. డొనాల్డ్ ట్రంపును ఎలా అడ్డుకోవాలని అన్నదానిపైనే నేటి సమావేశం" అని వ్యాఖ్యానించారు. ట్రంపును ఆపేందుకు జీ7 వేదికను వాడుకోవాలని కెనడా ప్రభుత్వాన్ని, మిత్రదేశాలను ఆయన అభ్యర్థించారు. ఆయనను ఎదుర్కోడానికి మెక్సికో, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి భావ సారూప్యత ఉన్న దేశాలతో జట్టు కట్టాలన్నారు. అత్యాధునిక ఆయుధాలతో కెనడా సైన్యాన్ని బలోపేతం చేయడానికి ఎన్డీపీ మద్దతు ఇస్తుందన్నారు.

సింగ్ ప్రకటనపై ఇప్పటివరకు కెనడా ప్రభుత్వం స్పందించలేదు. ప్రధాని కార్యాలయ ప్రతినిధి సైమన్ లాఫార్చ్యూ స్పందిస్తూ దీనిపై తాము ఎటువంటి వ్యాఖ్యలు చేయబోమని వెల్లడించారు. ఇక ఇంధన శాఖ మంత్రి జోనాథన్ విల్కిన్సన్ మాట్లాడుతూ జగ్మీత్ ప్రతిపాదనలో అంతగా విషయం లేదన్నారు. అంతేకాదు.. ఆలోచించి సలహాలు చెప్పేవారిని తాము కొత్త అడ్వైజర్లుగా నియమించుకోమని హితవు పలికారు. అంతేకాదు.. ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో చాలావరకు తనకు కోపం తెప్పించాయన్నారు. అదే సమయంలో కలిసి పనిచేసే మార్గాలను వెతకాలని సూచించారు. "మనం తెగదెంపులు చేసుకొని సముద్రంలో మరో చోటుకు వెళ్లిపోలేము కదా. వారు మన పొరుగువారు. కలిసే ముందుకెళ్లాలి" అని పేర్కొన్నారు. జూన్ 15నుంచి 17వరకు అల్బర్టాలో జీ7 సమావేశాలు జరగనున్నాయి.

# ట్రంప్ తొలి కేబినెట్ భేటీ

**- కొన్ని మీడియా సంస్థలను దూరంపెట్టిన ఓవల్ ఆఫీస్**

అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ తొలిసారి కేబినెట్ భేటీ నిర్వహించారు. భేటీకి రాకుండా కొన్ని మీడియా సంస్థలపై వైట్‌హౌస్ ఆంక్షలు విధించింది. రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, హఫ్పోస్ట్ సహా పలు సంస్థలకు చెందిన రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లను ఓవల్ ఆఫీస్ లోపలికి వెళ్లనివ్వలేదు. మీడియా కవరేజీపై తీసుకొచ్చిన కొత్త విధానాలకు లోబడే వారిని అనుమతించలేదని శ్వేతసౌధం వెల్లడించింది. ఓవల్ ఆఫీసువంటి చిన్న చిన్న ప్రదేశాల్లో ఏయే మీడియా సంస్థలు కవర్ చేయాలన్న దానిపై వైట్ హౌస్ నిర్ణయం తీసుకుంటుందని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. ఈ క్రమంలోనే కొన్ని మీడియా సంస్థలను క్యాబినెట్ సమావేశ కవరేజీకి అనుమతించలేదని తెలిపింది. ఏబీసీ, న్యూస్‌మాక్స్, బ్లూమ్‌బర్గ్, ది బ్లేజ్, యాక్సియోస్, ఎన్పీఆర్ సంస్థల ప్రతినిధులను మాత్రం లోనికి అనుమతించారు. దీనిపై శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ స్పందించారు. "ట్రంప్ రోజువారి మీడియా సమావేశాన్ని కవర్ చేసేందుకు సంప్రదాయ మీడియా సంస్థలన్నింటికీ అనుమతినిస్తున్నాం. కానీ, స్థలాభావం కారణంగా వైట్‌హౌస్‌లోని కొన్ని ఆఫీసుల్లోకి మాత్రం అందర్నీ పంపించట్లేదు. ఎంపిక చేసిన కొన్ని సంస్థలకు మాత్రమే కవరేజీకి యాక్సెస్ ఇస్తున్నాం" అని తెలిపారు. దీనిపై మీడియా సంస్థల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వైట్ హౌస్ నిర్ణయం.. పత్రికా స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని తప్పుబట్టాయి. కాగా.. గల్ఫ్ ఆఫ్ మెక్సికోను ఇటీవల ట్రంప్ గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చిన సంగతి తెలిసిందే. దీన్ని తమ కథనాల్లో పేర్కొనేందుకు అసోసియేటెడ్ ప్రెస్ నిరాకరించింది. ఈ కారణంతోనే ఈ మీడియా సంస్థను వైట్ హౌస్ పూల్‌నుంచి ట్రంప్ యంత్రాంగం తొలగించినట్లు తెలుస్తోంది.

### శాంతి చర్చలవైపు వడివడిగా..

# తుర్కియేలో మరోవిడత అమెరికా-రష్యా దౌత్యవేత్తల చర్చలు



అమెరికా, రష్యాలు శాంతి చర్చల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఇరు దేశాలకు చెందిన కీలక దౌత్యవేత్తలు తుర్కియేలో భేటీ అయ్యారు. ఇందుకు అమెరికా రాయబార కార్యాలయం వేదికైంది. గురువారమే రష్యా అధికారుల బృందం అకడికి చేరుకొంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపర్చుకొనేందుకు చేస్తున్న యత్నాల్లో భాగంగా.. వాషింగ్టన్, మాస్కోలోని దౌత్య కార్యాలయాల్లో ఉన్న వివాదా లను ఈ సందర్భంగా చర్చించుకొన్నారు. దౌత్య సిబ్బంది ఇరు దేశాల్లో పనిచేసే వాతావరణంపై చర్చించనున్నారు. దీనిలో ఉక్రెయిన్, ఇతర రాజకీయ, భద్రతాపరమైన అంశాలను చేర్చలేదు. ఈ చర్చలపై అమెరికా విదేశాంగశాఖ మాట్లాడుతూ "ఈ చర్చలు చాలా నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. అసలు సమస్యలు పరిష్కారం అవుతాయా..? లేదా అన్నది తేలిపోతోంది. దీంతోపాటు రష్యా మంచి ఉద్దేశంతోనే చర్చలకు వచ్చిందా? అనే విషయం కూడా తెలుస్తుంది" అని పేర్కొంది.

మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ మాట్లాడుతూ తమ దేశ దౌత్యవేత్తలకు మెరుగైన పరిస్థితులను కల్పించేందుకు ఈ చర్చలు జరుగుతున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో అడుగుపెట్టిన ఐదు వారాల్లోనే భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. రష్యా అధినేత పుతిన్ ఫిబ్రవరి 12న ఫోన్ కాల్‌లో మాట్లాడారు. తర్వాత 18న సౌదీ అరేబియాలో అత్యున్నత స్థాయి దౌత్యవేత్తలు, మంత్రులు భేటీ అయ్యారు. ఈ పరిణామాలతో కీవ్, ఐరోపా సమాఖ్య మిత్రులు అప్రమత్తమయ్యారు. ఉక్రెయిన్లో శాంతి కోసం ట్రంప్ శరవేగంగా తీసుకొంటున్న చర్యలపై పుతిన్ ఈ వారం స్పందించారు. అమెరికా, రష్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించకపోతే ఏమీ సాధించలేరని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇరుదేశాలు దౌత్యస్థాయిలో సమస్యల పరిష్కారానికి తుర్కియేలో భేటీ అయ్యాయి. ఇక రష్యాతో కూడా ట్రంప్ ఖనిజాల డీల్ చేసుకొంటారన్న వార్తలు వెలువడుతుండటంతో.. ఈ చర్చలకు ప్రాధాన్యం పెరిగింది.

# జన సంక్షోభంవైపు జపాన్.. అంతకంతకూ దిగజారుతున్న జననాల రేటు



జపాన్‌లో నానాటికీ జనాభా సంఖ్య పడిపోయి సంక్షోభం దిశగా వెళ్తోంది. తాజాగా 2024 జననాల రేటు అంతకు ముందు ఏడాదితో పోలిస్తే మరో 5శాతం పతనమై 7,20,988గా నమోదైంది. 1899 సంవత్సరం తర్వాత ఇంత తక్కువగా జననాల నమోదుకావడం ఇదే తొలిసారి. మరోవైపు దేశంలో వృద్ధుల సంఖ్య పెరగడంతో పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గి ప్రభుత్వానికి పన్ను ఆదాయం పడిపోయింది. కొత్తగా జన్మించే వారి సంఖ్య తగ్గడం వరుసగా ఇది తొమ్మిదో ఏడాది. ఈ విషయాన్ని ఆ దేశ ఆరోగ్యశాఖ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇక జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో.. మరణాల రేటు మాత్రం 1.8శాతం పెరిగి 16 లక్షలకు చేరింది. జనాభాను పెంచేందుకు ప్రభు త్వాలు యత్నాలు చేస్తున్నా.. అక్కడి ప్రజలు పిల్లల్ని కనేందుకు అంత ఆసక్తి చూపించడంలేదు. దీంతో ఆ దేశ ప్రధాని ఇషిబా చిల్డ్రన్ కేర్ పాలసీ కోసం ఏకంగా 3.6 ట్రిలియన్ యెన్లను కేటాయించారు. ఈ నిధుల్లో పిల్లల్ని కనేందుకు ఆసక్తిగా ఉన్న పెద్దవారికి, చిల్డ్రన్ కేర్ వర్కర్స్ పనివాతావరణం మెరుగు పర్చేందుకు వినియోగిస్తున్నారు. జనాభా తగ్గిపో వడానికి ప్రధాన కారణం వివాహాలకు యువత సుముఖంగా లేకపోవడం, వివాహమైనా పిల్లలను కనడానికి ఆసక్తిచూపకపోవడమేనని తెలుస్తోంది. నిరుద్యోగం, అధిక జీవన వ్యయం, మహిళలపట్ల వివక్ష తదితర సమస్యలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇదే ఒరవడి కొనసాగితే 2060 నాటికి జనసంఖ్య 8.67 కోట్లకు పడుతుందని అంచనా.

**ఆర్థికంగా పెనుప్రభావం..**

ఇక జననాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించే పరిస్థితి కూడా లేదు. అంతర్జాతీయ ద్రవ్యనిధి లెక్కల ప్రకారం ఇప్పటికే పబ్లిక్ రుణాలు జీడీపీకంటే 232.7శాతం వరకు ఉన్నాయి. 1995లో జపాన్‌లో అత్యధికంగా పనిచేసే ప్రజలున్నారు. అయితే ప్రస్తుతం ఆ దేశ లేబర్ మార్కెట్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నిరుద్యోగ రేటు 2.4 శాతం ఉంది. ఇది ఓఈసీడీ దేశాల్లోనే అతితక్కువ. ఇది 2040నాటికి 3శాతంగా కొనసాగుతుందని అంచనాలున్నాయి. రిక్రూట్ వర్కర్స్ ఇనిస్టిట్యూట్ అంచనాల ప్రకారం 1.1 కోట్ల ఉద్యోగుల కొరతను జపాన్ ఎదుర్కోవచ్చు. 2024లో జపాన్‌లోని 342 కంపెనీలు దివాలాతీశాయి. కార్మికుల కొరతే దీనికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ విషయాన్ని టెయికోకు డేటా బ్యాంక్ వెల్లడించింది.

**ప్రభుత్వంపై భారం..**

రిటైర్మెంట్ వయస్సు దాటిన ప్రజల సంఖ్య నానాటికీ పెరిగిపోతుండటంతో సోషల్ సెక్యూరిటీ వ్యయాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం అక్కడ ప్రభుత్వం 253 బిలియన్ డాలర్లను కేటాయిస్తోంది. పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇది 20శాతం అదనం. ఆ దేశ పెన్షన్ వ్యవస్థలో చెల్లించేవారి సంఖ్య 30లక్షలు తగ్గగా.. తీసుకొనేవారి సంఖ్య 40శాతం పెరిగింది. ఈ విషయాన్ని అక్కడ సంక్షేమశాఖ వెల్లడించింది.

**ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఇదే ట్రెండ్..**

జపాన్‌వలే గత 9 ఏళ్లగా జననాల తగ్గుదలతో అవస్థపడిన దక్షిణ కొరియాలో ఈ ఏడాది తొలిసారి స్వల్పంగా పెరిగింది. కానీ, అది కూడా అవసరమైనదానికంటే 0.75శాతం మాత్రమే అధికంగా ఉంది. ఫ్రాన్స్‌లో 2023 నుంచి జననాల రేటు గణనీయంగా పడిపోవడం మొదలైంది. గత 50 ఏళ్లలో ఎన్నడూ ఈ స్థాయిలో తగ్గుదల లేదు. ఇక చైనాలో వరుసగా మూడేళ్లుగా జననాల రేటులో తగ్గుదల నమోదైంది.

# రష్యాకు మరింత 'కిమ్' సేన!



క్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున ఉత్తర కొరియా సైన్యం పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో వందల మంది కిమ్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్టు నివేదికలు వచ్చాయి. అయినప్పటికీ తాజాగా మరిన్ని బలగా లను కిమ్ రష్యాకు పంపించినట్లు దక్షిణ కొరియా నిఘా విభాగం నేషనల్ ఇంటలిజెన్స్ సర్వీస్ వెల్లడించింది. అయితే, ఈసారి ఎంతమందిని పంపిం చిందనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపింది.

రష్యాకు భారీస్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి పంపిస్తోన్న ఉత్తర కొరియా.. కొంతకాలం క్రితం 10నుంచి 12వేల మంది సైనికులను పంపించినట్లు అమెరికా, దక్షిణ కొరియాతోపాటు ఉక్రెయిన్ నిఘా విభాగాలు వెల్లడించాయి. గడిచిన రెండు నెలల్లో కుర్క్ ప్రాంతంలో వెయ్యినుంచి 3వేలమంది కిమ్ సైన్యాన్ని మోహరించినట్టు తెలుస్తోంది.

ఉత్తరకొరియా సైనికులు చాలా క్రమశిక్షణతోపాటు మంచి శిక్షణ కూడా పొంది ఉన్నట్లు కనిపిస్తున్నారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, యుద్ధక్షేత్రంలో అనుభవలేమి, అక్కడి భూభాగంపై అవగాహన లేకపోవడంలో డ్రోన్ దాడులకు లక్ష్యంగా మారుతున్నట్టు సమాచారం. జనవరిలోనే 300మంది కిమ్ సైనికులు చనిపోగా, 2700మంది గాయపడినట్టు అంచనా. అయితే, మొత్తంగా 4వేల మంది ఉత్తర కొరియా సైనికులు చనిపోవడమో లేదా గాయపడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ చెప్పినప్పటికీ.. అమెరికా మాత్రం ఈ సంఖ్య 1200గా పేర్కొంది.

సైనిక, ఆయుధ సాయాన్ని అందిస్తోన్న ఉత్తర కొరియాకు బహుమానంగా.. రష్యా అత్యాధునిక ఆయుధాలు, అత్యున్నత సాంకేతికతను అందజేయవచ్చని తెలుస్తోంది. దీంతో ఉ.కొరియా అణ్వాయుధ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చని దక్షిణ కొరియా, అమెరికా మిత్రపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే, ఉక్రెయిన్- రష్యా యుద్ధం ముగింపు కోసం సౌదీ అరేబియా వేదికగా చర్చలు జరుగుతున్న వేళ ఉ.కొరియా అదనపు బలగాలు పంపించడం గమనార్హం. అయితే, ముగింపునకు ముందే మరిన్ని బలగాలు పంపించి రష్యానుంచి మరింత సాయం పొందేందుకు కిమ్ ప్రయత్నాలు చేసే అవకాశం లేకపోలేదని పరిశీలకులు చెబుతున్నారు.

***20వేల కంటైనర్లలో ఆయుధాలు అందచేత***

ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరపున ఉత్తర కొరియా సైనికులు కూడా బరిలోకి దిగాలన్న ఆలోచన పుతిన్ నుంచి వచ్చింది కాదని అమెరికా నిఘా వర్గాలు చెబుతున్నాయి. స్వయంగా కిమ్ జోంగ్ ఉన్ దీనిని క్రెమ్లిన్ ముందు ఉంచినట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక కథనంలో పేర్కొంది. మరోవైపు మానవ వనరుల కొరత కూడా తీవ్రంగా ఉండటంతో మాస్కో కూడా దీనికి అంగీకరించినట్లు అమెరికా ఇంటెలిజెన్స్ భావిస్తోంది. ఇక దీనికి ప్రతిగా తమకు టెక్నాలజీ బదలాయింపు జరుగుతుందని ఉత్తర కొరియా భావిస్తోంది. దీంతోపాటు అంతర్జాతీయ వేదికలపై దౌత్య మద్దతు ఉండే అవకాశం ఉంది. దాదాపు 12,000 మంది సైనికులను ఇప్పటికే రష్యాకు తరలించినట్లు తెలుస్తోంది. దీనికితోడు వేల కంటైనర్లలో ఆయుధాలు కూడా ప్యాంగ్యాంగ్ నుంచి వెళుతున్నాయి.

***భారీగా కిమ్ సర్కారు ఆయుధ సరఫరా***

రష్యా కోసం ఉత్తరకొరియా ఇప్పటికే 20,000 షిప్పింగ్ కంటైనర్లలో ఆయుధాలను తరలించినట్లు అమెరికా ఐరాస ప్రతినిధి బృందం నివేదికలో పేర్కొంది. వీటిలో దాదాపు 60 లక్షల శతఘ్ని గుండ్లు ఉన్నాయి. వీటిల్లో 122 ఎంఎం, 152 ఎంఎం రకాలున్నాయి. దీంతోపాటు 100 హ్వాసంగ్-11 శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను రష్యాకు తరలించినట్లు పేర్కొంది. సెంటర్ ఫర్ ఆర్మ్డ్ మెంట్ రీసెర్చ్ సంస్థ ఈ వివరాలను గుర్తించింది. వీటిల్లో చాలావరకు ఇప్పటికే ఉక్రెయిన్‌పై ప్రయోగించారని వెల్లడించింది. ఉత్తర కొరియాలోని దాదాపు 200 ఆయుధ ఫ్యాక్టరీలు పూర్తిస్థామర్థ్యంతో ఉత్పత్తిని వేగవంతం చేశాయని వాల్ట్ జర్నల్ కథనంలో పేర్కొంది. హ్వాసంగ్-11 శ్రేణి బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాల్లో కొత్త పరికరాలు అమర్చి, నిర్మాణాలు చేపట్టి ఉత్పత్తిని పెంచినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం కార్యక్రమాన్ని అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా పరిశీలిస్తున్నారు.

ఉత్తర కొరియా- రష్యాల మధ్య రైళ్ల రాకపోకలు కూడా రికార్డుస్థాయిలో పెరిగాయని వాలెట్ కథనంలో పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ది తుమాన్గాంగ్- హసన్ రైలు బోర్డర్ వద్ద రాకపోకలు మూడురెట్లు పెరిగాయి. మరోవైపు రష్యానుంచి కిమ్ సర్కారుకు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, నిఘా ఉపగ్రహాల తయారీలో సాంకేతిక మద్దతు లభిస్తోందని దక్షిణ కొరియా అధికారులు చెబుతున్నారు. అంతేకాదు... ఖండాంతర క్షిపణుల అభివృద్ధిలో ఉత్తరకొరియాకు సహకరించాలని రష్యా భావిస్తోంది.

చైతన్యరథం

ఛాంపియన్స్ ట్రోఫీ..

# పాకిస్థాన్-బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు!



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. షెడ్యూల్ ప్రకారం ఆతిథ్య పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య రావల్పిండి వేదికగా గురువారం జరగాల్సిన మ్యాచ్ వర్షార్పణమైంది. ఉదయం నుంచే వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో ఔట్ ఫీల్డ్ మొత్తం చిత్తడిగా మారింది. ఔట్ ఫీల్డ్‌లో మొత్తం నీళ్లు చేరడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. దాంతో టాస్ కూడా వేయకుండానే ఈ మ్యాచ్‌ను అంపైర్లు రద్దు చేశారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ఇప్పటికే ఈ టోర్నీ సెమీస్ రేసు నుంచి పాకిస్థాన్, బంగ్లాదేశ్ తప్పుకున్న విషయం తెలిసిందే.

న్యూజిలాండ్, భారత్ చేతిలో ఓడిన ఆతిథ్య పాకిస్థాన్.. బంగ్లాదేశ్‌తోనైనా విజయం సాధించి తమ అభిమానులను సంతోష పెట్టాలని భావించింది. కానీ ఆ జట్టు ఆశలపై వరుణుడునీళ్లు జల్లాడు. దాంతో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఈ టోర్నీ బరిలోకి దిగిన పాకిస్థాన్.. ఒక్క విజయం సాధించకుండానే తమ ప్రస్థానాన్ని ముగించింది. 29 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐసీసీ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన పాకిస్థాన్ దారుణమైన ప్రదర్శనతో తమ అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

మరోవైపు బంగ్లాదేశ్ సైతం భారత్, న్యూజిలాండ్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. పాకిస్థాన్‌తో చివరి మ్యాచ్‌లోనైనా విజయం సాధించాలనుకుంది. గ్రూప్-ఏ నుంచి భారత్, న్యూజిలాండ్ సెమీస్ చేరాయి. గ్రూప్-ఏలో పాకిస్థాన్ అట్టడుగు స్థానంలో నిలవడం గమనార్హం. ఆదివారం ఈ రెండు జట్ల మధ్య జరిగే మ్యాచ్ ఫలితంతో గ్రూప్-ఏ టాపర్ ఎవరో తెలియనుంది. ఇప్పటికే ఈ టోర్నీలో సౌతాఫ్రికా వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షంతో రద్దయ్యింది. దాంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

# అఫ్ఘానిస్తాన్-ఆస్ట్రేలియా మధ్య డూ ఆర్ డై మ్యాచ్

## - పరుగుల వరద పారనుందా?

ఛాంపియన్స్ ట్రోఫీలో శుక్రవారం ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య డూ ఆర్ డై మ్యాచ్ జరగనుంది. సెమీ ఫైనల్ చేరుకోవడానికి ఈ మ్యాచ్ రెండు జట్లకు చాలా కీలకం. గెలిచిన జట్టు నేరుగా సెమీ-ఫైనల్స్ కు చేరుకుంటుంది. ఓడిపోయిన జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమించడం ఖాయం. ఈ రెండు జట్ల మధ్య ఈ కీలక మ్యాచ్ లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరగనుంది.

### గడాఫీ స్టేడియంలో పరుగుల వరద పారనుందా?

లాహోర్‌లోని గడాఫీ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ అధిక స్కోరింగ్ పిచ్ ఫాస్ట్ బౌలర్లు , స్పిన్నర్లకు పెద్దగా సహకరించదు. ఈ క్రమంలో మరోసారి పిచ్ పై భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ స్టేడియంలో ఇంగ్లాండ్, ఆసీస్ జట్లు తలపడిన మ్యాచ్ లో 350 కంటే ఎక్కువ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఛేదించింది. అదే విధంగా ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ లో ఇరు జట్లు 300 కంటే ఎక్కువ స్కోరును సాధించాయి. ఈ నేపథ్యంలో ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య జరిగే మ్యాచ్ లో మళ్లీ 300 కంటే అధిక స్కోర్లు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

### ఇరు జట్ల రికార్డులు ఎలా ఉన్నాయంటే?

ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్ 4 వన్డేలలో ముఖాముఖిగా తలపడ్డాయి. ఈ నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఆస్ట్రేలియానే గెలిచింది. ఆఫ్ఘనిస్తాన్ ఒక్కసారి కూడా గెలవలేదు. ఇటీవల 2023 ప్రపంచ కప్ సమయంలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఆస్ట్రేలియాను ఓడించడానికి చాలా దగ్గరగా వచ్చింది.. కానీ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అద్భుత డబుల్ సెంచరీ వారి నుంచి ఈ అవకాశాన్ని చేజారేలా చేసింది.






అయితే ఆఫ్ఘన్ జట్టును తక్కువగా అంచనా వేయలేం. ఇంగ్లాండ్‌పై గెలుపుతో ఊపు మీదున్న ఆఫ్ఘనిస్తాన్.. ఆస్ట్రేలియాను కూడా కట్టడి చేయాలని భావిస్తోంది.

### ఇరు జట్లు ఇవే..

**ఆఫ్ఘనిస్తాన్ జట్టు:** రహ్మానుల్లా గుర్బాజ్, రహ్మత్ షా, అష్మతుల్లా షాహిది, సెదికుల్లా అటల్, ఇబ్రహీం జద్రాన్, గుల్బదిన్ నాయిబ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, ఫజల్ హక్ ఫారూఖీ, నూర్ అహ్మద్

**ఆస్ట్రేలియా జట్టు:** స్టీవ్ స్మిత్, సీన్ అబాట్, అలెక్స్ కేరీ, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, స్పెన్సర్ జాన్సన్, మార్నస్ లబుషేన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, తన్వీర్ సంఘ, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా.



న్యూజిలాండ్‌తో మ్యాచ్..

# ప్రాక్టీస్‌కు దూరంగా రోహిత్, గిల్

ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండు మ్యాచ్లో విజయం సాధించిన టీమ్ ఇండియా సెమీస్ కు దూసుకెళ్లింది. అదే ఊపును ఆదివారం (మార్చి 2) న్యూజిలాండ్ జరిగే చివరి లీగ్ మ్యాచ్లోను కొనసాగించాలనుకుంటోంది. ఈ మ్యాచ్ కోసం టీమిండియా బుధవారం ప్రాక్టీస్ సెషన్స్లో పాల్గొంది. అయితే, కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం సాధనకు దూరంగా ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఐసీసీ అకాడమీలో భారత ఆటగాళ్లు ఫుట్‌బాల్, రన్నింగ్ చేసి చెమటోడ్చుతుండగా, రోహిత్ మాత్రం కఠినమైన శారీరక కసరత్తులకు దూరంగా ఉన్నాడట. అతను స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహం దేశాయ్ పర్యవేక్షణలో మెల్లగా జాగింగ్ చేసినట్లు తెలుస్తోంది. కానీ, రోహిత్ స్వేచ్ఛగా కదలడం లేదని జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. భారత కెప్టెన్ ఎలాంటి త్రో డౌన్లు ఎదుర్కోకుండా కేవలం షాడో బ్యాటింగ్ చేస్తూ హెడ్ కోచ్ గంభీర్, ఇతర కోచింగ్ సిబ్బందితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత కెప్టెన్ తొడ కండర గాయంతో బాధ పడ్డాడు. అయితే తాను బాగానే ఉన్నానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాక్‌తో మ్యాచ్ అనంతరం చెప్పాడు.

### శుభమన్ గిల్ కూడా

ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న శుభమన్ గిల్ కూడా ప్రాక్టీస్ సెషన్కు హాజరుకాలేదని సమాచారం. అతను హోటల్ రూమ్‌కే పరిమితమైనట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్తో జరిగిన మ్యాచ్లో సెంచరీ చేసిన గిల్ అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. రిషభ్ పంత్ జ్వరం నుంచి కోలుకొని బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఆటగాళ్ల ఫిట్‌నేస్ ఆందోళనల దృష్ట్యా న్యూజిలాండ్ జరిగే మ్యాచ్‌లో టీమిండియా తుది జట్టులో మార్పులు ఉండే అవకాశం ఉంది. కొంతమంది ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి ఇప్పటివరకు ఛాన్స్ రాని ప్లేయర్లను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోవచ్చు. టోర్నీలో మొదటి రెండు మ్యాచ్‌లో భారత్ ఒకే తుది జట్టుతో ఆడిన సంగతి తెలిసిందే.

# 'ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో రోహిత్‌కు బాగా తెలుసు!'

## హిట్ మ్యాన్‌పై మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసలు




టమిండియా కెప్టెన్ రోహిత్ శర్మపై మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసలు కురిపించాడు. రోహిత్‌తో తాను ఓపెనింగ్ చేసిన రోజులను గుర్తు చేసుకున్నాడు. హిట్‌మ్యాన్‌తో ఓపెనింగ్ చేయడం ధోనీ తీసుకున్న నిర్ణయమని చెప్పాడు. కెప్టెన్‌గా రోహిత్ చాలా పరిణతి చెందాడని కొనియాడాడు. రీసెంట్‌గా ఓ కార్యక్రమంలో రోహిత్ గురించి గబ్బర్ కీలక విషయాలు వెల్లడించాడు.

### అది ధోనీ నిర్ణయమే

'మేమిద్దరం ఓపెనింగ్‌కు రావడమనే నిర్ణయం మ్యాచ్‌కు కొన్ని గంటల ముందే జరిగింది. అప్పటికి జట్టులో నేను కొత్తవాడిని. అప్పటి కెప్టెన్ ఎంఎస్ ధోనీ నన్ను రోహిత్‌తో ఓపెనింగ్ చేయమని ఆదేశించాడు. రోహిత్‌తో ఓపెనర్‌గా బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదించాలనుకున్నాను. తొలి మ్యాచ్‌లోనే మా ఓపెనింగ్ జోడీకి గొప్ప ఆరంభం లభించింది. 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాం. మొదట్లో వికెట్ సీమ్ అవుతుండటం వల్ల 10 ఓవర్లకు 30 పరుగులే చేయగలిగాం. తర్వాత కుదురుకున్నాం. 10 ఏళ్లు మేము ఓపెనర్లుగా రాణిస్తామని నేనెప్పుడూ అనుకోలేదు' అని శిఖర్ ధావన్ తెలిపాడు.

అలాగే రోహిత్‌తో తనకున్న స్నేహం గురించి కూడా శిఖర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య స్నేహ బంధం మైదానంలో, బయట కూడా ఒకేలా ఉంటుందని తెలిపాడు. 'మేము ఒకరినొకరం నమ్ముకుంటాం. మా మధ్య మంచి కమ్యూనికేషన్ ఉంది. రోహిత్, నేను కలిసి చాలా సిరీస్‌లు ఆడి, గెలిచాం. నేను అండర్-19కి ఆడేటప్పుడు రోహిత్ వయసు 16-17 ఏళ్లు. అప్పటి నుంచి రోహిత్ నాకు తెలుసు. మేమిద్దరం మంచి స్నేహితులం' అని ధావన్ స్పష్టం చేశాడు.

### ఎక్కడ తగ్గాలో తెలుసు

అలాగే రోహిత్ కెప్టెన్సీపై కూడా గబ్బర్ ప్రశంసలు కురిపించాడు. కెప్టెన్సీలో ఒత్తిడిని ఎదుర్కోగల సామర్థ్యం రోహిత్‌కు ఉందని కొనియాడాడు. అలాగే ప్లేయర్ల నుంచి మంచి ప్రదర్శనను రాబట్టడం, వారిని ఐక్యంగా రోహిత్ ఉంచగలడని తెలిపాడు. 'రోహిత్‌కు చాలా అనుభవం ఉంది. ఒత్తిడి పరిస్థితుల్లో జట్టును ఎలా నడపాలో తెలుసు. యంగ్ ప్లేయర్స్‌ను ఎలా ప్రోత్సహించాలో కూడా తెలుసు. నాయకుడిగా రోహిత్ పరిణితి చెందాడు. ఎప్పుడు ఉదారంగా ఉండాలో ఎప్పుడు వెనక్కి తగ్గాలో తెలుసు. అందుకే యంగ్ ప్లేయర్స్‌తో రోహిత్ బంధం బాగుంటుంది' అని ధావన్ వ్యాఖ్యానించాడు.



చైతన్య రథం సినిమా
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025




## స్టార్ ప్రొడ్యూసర్‌కి
# ఐకాన్ స్టార్ ఆఫర్?

టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఇటీవల బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో బాక్సాఫీస్ దగ్గర సందడి చేశారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన ప్రెస్టీజియస్ మూవీ 'గేమ్ ఛేంజర్'తో పాటు.. విక్టరీ వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలతో సంక్రాంతికి సందడి చేశారు. అయితే, గేమ్ ఛేంజర్ ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోక పోయినా.. సంక్రాంతికి వస్తున్నాం మూవీ సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ఎవరూ ఊహించని విధంగా కలెక్షన్స్ రాబట్టడంతో దిల్ రాజు సేఫ్ అయ్యారు. ఇక తన తరువాతి మూవీ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు దిల్ రాజు. ఈ క్రమంలో అల్లు అర్జున్ ఆయనకు ఓ గోల్డెన్ ఛాన్స్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. దిల్ రాజు బ్యానర్‌లో మంచి కథ, దర్శకుడు సెట్ అయితే సినిమా చేసేందుకు తాను రెడీ అంటూ దిల్ రాజుకి బన్నీ ఓపెన్ ఆఫర్ ఇచ్చినట్లుగా సినీవర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి.

'పుష్ప–2' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత అల్లు అర్జున్ ఇలా ఓ స్టార్ ప్రొడ్యూసర్‌కి ఓపెన్ ఆఫర్ ఇవ్వడం నిజంగా విశేషమని అభిమానులు అంటున్నారు. మరి నిజంగానే ఈ కాంబోలో సినిమా సెట్ అవుతుందా? అనేది వేచి చూడాలి.




# జస్ట్.. ప్రభాస్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే.. గెస్ట్ పాత్రల్లోనూ కనిపిస్తున్నాడు. ప్రభాస్ క్యామియో రోల్ పోషిస్తోన్న చిత్రమే "కన్నప్ప". మంచు విష్ణు కెరీర్లో భారీ ప్రాజెక్ట్ మాత్రమే కాదు, అతని డ్రీం ప్రాజెక్ట్ కూడా. ఈ సినిమా కోసం పాన్ ఇండియా వైడ్‌గా అనేకమంది స్టార్స్‌ని రంగంలోకి దించారు. మంచి హైప్‌ని అందుకున్న చిత్రంలో రెబల్ స్టార్ కూడా 'రుద్రా' అనే పవర్ఫుల్ పాత్రలో చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ అయ్యింది. ఇటీవల వచ్చిన ఫస్ట్ లుక్‌పై కొంచెం భిన్నమైన స్పందన వచ్చింది. కానీ తాజా పోస్టర్ ఫ్యాన్స్‌ని ఖుషీ చేస్తోంది. పోస్టర్‌లో ప్రభాస్.. మాస్‌ని అట్రాక్ట్ చేసే హ్యాండ్సమ్ డార్లింగ్‌లా కనిపిస్తున్నాడు. కొత్త లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో, ఫ్యాన్స్‌లో వైరలవుతోంది.

# 3న 'ది ప్యారడైజ్' గ్లింప్స్



న్యాచురల్ స్టార్ నాని ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే ఆయన ది మోస్ట్ అవైటెడ్ ఫ్రాంచైజీ మూవీ 'హిట్–3'ని రిలీజ్‌కు రెడీ చేశాడు. దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీలో నాని ఓ రగడ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమా తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' అనే చిత్రంలో నటిస్తున్నాడు. ఇప్పటికే సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేసిన చిత్ర యూనిట్, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేయనున్నారు. అయితే, సినిమా నుంచి సాలిడ్ ట్రీట్‌గా మూవీ గ్లింప్స్ రిలీజ్‌కు మేకర్స్ రెడీ అవుతున్నారు. 'ది ప్యారడైజ్' గ్లింప్స్ వీడియోను మార్చి 3న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు. ఈ గ్లింప్స్ వీడియో కేవలం పాన్ ఇండియాగా కాకుండా.. ఇంటర్నేషనల్ ట్రీట్ ఇవ్వబోతోందన్న మాట వినిపిస్తోంది. 'ది ప్యారడైజ్' గ్లింప్స్‌ను తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషలతో పాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో రిలీజ్ చేయనున్నారు మేకర్స్. అంటే 'ది ప్యారడైజ్' అంతర్జాతీయ ఆడియన్స్‌ని అలరించేందుకు రెడీ అవుతోందన్న మాట.

## జూన్ 20న
# కుబేర!




టాలీవుడ్ మ్యాజికల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న లేటెస్ట్ సినిమానే "కుబేర". టాలెంటెడ్ హీరో ధనుష్ హీరోగా రష్మిక మందన్నా ఫీమేల్ లీడ్‌లో అక్కినేని నాగార్జున సాలిడ్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం.. ఇప్పుడు వచ్చిన అప్డేట్స్‌తో మంచి బజ్‌ని అందుకుంది. అయితే చిత్రం రిలీజ్ ఎప్పుడెప్పుడా? అని ఎదురు చూస్తున్న అభిమానులకి మేకర్స్ ఫైనల్‌గా ఒక అఫీషియల్ డేట్‌ని ఇచ్చేసారు. దీనితో ఇదివరకు చెప్పినట్టుగానే కుబేర చిత్రం ఈ జూన్ 20న రిలీజ్ చేస్తున్నట్టుగా ఒక ఇంట్రెస్టింగ్ పోస్టర్‌తో మేకర్స్ రివీల్ చేశారు. ఇందులో నాగార్జున, ధనుష్‌లు ఎదురెదురుగా చూసుకుంటుండగా వారి చుట్టూ నగరం, బస్తీ ఇల్లు కనిపిస్తున్నాయి. ఇక మధ్యలో బాలీవుడ్ నటుడు జిమ్ షర్బ్ కనిపిస్తున్నారు. ఇలా మొత్తానికి అయితే మేకర్స్ ఫైనల్‌గా అవైటెడ్ డేట్‌ని రివీల్ చేశారు. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, ఆసియన్ సునైల్‌లు నిర్మాణం వహిస్తుండగా పాన్ ఇండియా భాషల్లో ఈ చిత్రం రిలీజ్‌కి రాబోతుంది.

# 'కూలీ' బోర్డులోకి పూజా

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాలో పూజా హెగ్డే నటించనున్నట్టు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పూజా భాగమైనట్టు టీమ్ తెలిపింది. ఈ చిత్రబృందం ఇటీవల ఓ ప్రీ లుక్ పోస్టర్ విడుదల చేసి ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టాలంటూ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ ప్రీ లుక్ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ కన్ఫార్మ్ చేసింది. అయితే పూజా ఇందులో కీలక పాత్రలో నటించనున్నారా, లేదంటే స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనిరుధ్ ఈ సినిమాకు జైలర్‌లోని "కావాలయ్యా" పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. దీనికోసం పూజా హెగ్డేను ఎంపిక చేశారని అభిమానులు భావిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడివున్న ఈ యాక్షన్ థ్రిల్లర్లో.. రజనీ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. సినిమా ఆగస్టులో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది.



# లిరిసిస్ట్‌గా రామ్ పోతినేని

టాలీవుడ్ యంగ్ హీరోస్‌లో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఒకరు. రామ్ హీరోగా దర్శకుడు మహేష్ బాబు కాంబినేషన్‌లో సినిమా రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. అయితే చిత్రం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా.. మేకర్స్ శరవేగంగా చిత్రాన్ని ఏపీలో పలు లొకేషన్స్‌లో తెరకెక్కిస్తున్నారు. టాలీవుడ్‌లో క్రేజీ డాన్స్ మూమెంట్స్ చేయగల అతి తక్కువమంది హీరోల్లో రామ్ పోతినేనిది సెపరేట్ ప్లేస్. తనలోని మరో టాలెంటునీ పరిచయం చేయబోతున్నారట. ఇపుడు నటిస్తున్న సినిమా కోసమే తాను ఒక లవ్‌సాంగ్‌ని రాసినట్టుగా తెలుస్తుంది. దీనితో తాను రాసిన పాట తన ఫ్యాన్స్ ఆడియెన్స్ కూడా విననున్నారని చెప్పవచ్చు. ఈ చిత్రానికి వివేక్, మెర్విన్ ద్వయం సంగీతం సమకూరుస్తుంటే.. మైత్రి మూవీ మేకర్స్ చిత్రాన్ని నిర్మిస్తోంది.

